# పాంచజన్యము

V. R. NARLA MEMORIAL LIBRARY
V. R NARLA
D. P. R. L
Acc. No.

894.8271
GNA


కవిసార్వభౌమ, కళాప్రపూర్ణ,
యస్. టి. జ్ఞానానందకవి

ci

Dr. B. R. AMBEDKAR
OPEN UNIVERSITY
LIBRARY
HYDERABAD-500 033

# పాంచజన్యము

9. 11. 83



DR. B.R AMBEDKAR OPEN UNIVERSITY
UNIVERSITY - LIBRARY
N10409

V.R. NARLA MEMORIAL LIBRARY
V.R NARLA
D.P.R.I.
Acc. No.
10409

కవిసార్వభౌమ, కళాప్రపూర్ణ,
యస్. టి. జ్ఞానానందకవి

...ర్పు :
మన్మథ, శ్రావణము, 1956

మలికూర్పు :
రౌద్రి, మాఘము, 1981

894.8271
GNA

మూల్యము :
పది రూపాయలు

ముద్రణ :
శ్రీపతి ప్రెస్,
కాకినాడ.

2

AOUA105B142

# భూమిక

రసజ్ఞ పాఠకలోకమునకు :

మహోజ్జ్వలానందాతిశయ మధుర శుభవేళాఘంటి కల రవళిలో నవ్యాంధ్ర రాజ్యలక్ష్మి నీరాజన మందికొన్న నాటికే నా యీ "పాంచజన్య" ఖండకావ్యకృతి ముగిసినది. సమాదరణము లభింపమికి వట్టిచేతులతో నే యీ దివ్యాంధ్ర రాష్ట్ర జననికి ప్రియమారఁ బూజ గావించి నా ఋణమును దీర్చుకొంటిని.

తొలి ఖండకావ్యము "వసంతగాన" మేనాడో యచ్చు వడి కొలఁది దినాలలోనే యమ్ముడు వోయినది. మఱల నేటి దాక నది ద్వితీయజన్మ మెత్త లేదు. ఆ జన్మ మెత్తు టెప్పుడో ?

విజ్ఞులైన రసజ్ఞుల సమధిక సమాశ్రయ మున్నచో మఱల నుద్భవము నందునేమో ?

విశ్వతోముఖముగా ననంత రూపములతో నృత్య విన్యాసము గావించుచున్న నేటి సాహితీ కళారమకు నమనమ ములు ఘటించి కవికుల జమా బందికి నీ నా "పాంచజన్యము" కూడ నొక శరచ్చంద్రిక కాగలదని నా లిప్స.

ఇందులో కొన్ని రచనలు కళాపిపాసువులకు బరిచిత మైనవే. "విశ్వభారతి" రచన నేనాడో హిజ్ మాస్టర్ వాయిస్ గ్రామఫోను కంపెనీవారు రికార్డుగాఁ దీయించిరి. సంక్రాంతి సందేశముగా నాలిండియా రేడియో (విజయవాడ) వారి సౌజన్యముతో నాటి సంక్రాంతిదినమున స్వీయ కవితాపఠ

నముఁగావించిన రచన లానా డముద్రితమైన యీ పాంచ జన్యములోనివే. కనీసము సానుభూతినందని తెలుగు కవన కళ రాణించుట దుర్లభముగదా! రచనలు వేనవేలు. ఎవని దారి వానిది. కాని కవిత్వమునకు గొప్పతన మాపాదించునది యనుభూతియే కాని మఱొండు కాదు. కావుననే మహాకవి కాగలిగినవాడు హృదయమున వికాసోన్మీలనమైనవాఁడుగా నుండవలెను. ఈ వికాసోన్మీలనము పరమేశ్వరుని కరుణవలన గలుగును. ఆ పరమేశ్వరుని రూపమే ప్రతిభ.

వేఱొక మనవి :

ఈ సాకృతిని గౌరవనీయులు, దీనజనబాంధవులనైన మ॥రా॥రా॥ శ్రీ దామోదర సంజీవయ్య బి. యె. బి. యల్. మంత్రి శిఖామణులకు నంకిత మిచ్చితిని. శ్రీవారికుటుంబము నకుఁ బరమేశ్వరుఁ డితోధికైశ్వర్యారోగ్యములిచ్చి సాకుత!

ఎన్నియో గండముల నధిగమించి నేడీరూపముదాల్చిన యీ నాకృతిస్వరూపమును మున్న తిలకించిన కవితావతం సులు నాంధ్రరాష్ట్రశాసనసభాసభ్యులు, మిత్రులు శ్రీయుతులు పాల వెంకటసుబ్బయ్యగారు నన్ను కొండాకపరి కడపజిల్లా యాదర్శకగ్రామమైన మంటపంపల్లి వాస్తవ్యులును, "శీలవతి" కావ్యభర్తృత్వము వహించిన శ్రీమంతులు, రెడ్డికులసంజా తులు, శ్రీ పుట్టమరెడ్డి రమణారెడ్డిగారి దర్శనము సేయింప శ్రీ రెడ్డిగారు నా కావ్యము సాంతముగా విని ముద్రింపించు టకు వలయువిత్తము నయాచితముగా నిడి వారి మహోదార స్వభావమును వ్యక్తము జేసిరి. శ్రీ రెడ్డిగారికి నా నమస్సులు.

ఏమి గొప్ప ? సదస్సులో! మానెడు వరాలు
కవికి తొల్లిట రెడ్డిధవు డొసగుట
నేమి వింత ? జగతిలో మాన్యమా కృతి
గొని మున్న రాజు భూధనము లిడుట
ఏమి విశేషమ్ము ? శ్రీమహిత్వకవిత్వ
రససిద్ధి కొక రాజు వసువు లిడుట
ఏమి రసికత సభామంటపమున పూ
ర్వ మొకరసజ్ఞుండు ప్రస్తుతింప
పోషణమున తెలుగుభాషణమ్ము రహించె
మనువు రాచరికము మనుటకతన
రాచరికము లేని రమణరెడ్డి త్వదీయ
కరము నేడు కవికి కల్పవల్లి.

రెడ్డినాథుల కరుణార్ద్రి దృగ్విశేష
గాఢతరబంధురంబగు కంబమందు
వెలిగె నానాడు సుకవితోజ్జ్వలపు దివ్వె
వెలుగుగాత నేడును తదుజ్జ్వలపు దివ్వె.

మిత్రులు శ్రీ పాల వెంకటసుబ్బయ్యగారిమీద చెప్పికొన్న పద్యమిట నుల్లేఖించుట తప్పుగాదనుకొందును.

"చటులోజ్జ్వల్య కళాసుధాసదన! భాషాదేవి మస్తంబునన్
పటు చైతన్యవినూత్న భావ సుమపున్గబ్బాలఁ దాల్పించి సం
కటముంబడ్డ కులమ్ము మేలుకయి దీక్షంబూను,మా "పాలవేం
కటసుబ్బయ్య" కవీడ్గజేంద్రమునకుం గైమోడ్పు లర్పించెదన్

కాకినాడ

29-4-55

జ్ఞానానందకవి

# నా మాట

పాంచజన్యమున కిది రెండవకూర్పు. మొదటికూర్పు పాతికేండ్ల క్రిందటిమాట. నాపాతికవత్సరాల ప్రాయము లోపల వ్రాయబడిన వీ ఖండకృతులు.

పరమేశ్వరానుగ్రహమువలన మరల ఈకృతి నచ్చు వేయింప గల్గుచున్నాను.

కవితాప్రపంచములో కలమూనిన నాకు నేటికి అయిదు పదుల వత్సరాలు గడచినవి.

ఈ కాలములో సమాజమువలన నెన్నో ధిక్కారాలు స్వాగత సత్కారాలు, ఖేద మోదాలు లభియించినవి. అయినను కృషి విడువలేదు.

తెలుగుదేశము నన్ను ఆదరించి గౌరవించినది. రసరమ్య మూర్తులకు నా రచనలు ఆహ్లాదమును కలిగించినవి. కావ్య గాన సమ్మేళనాలలో ఆకాశవాణీ ప్రసారాలలో నాకవిత విని నేటికిని రసహృదయులు నన్నభినందించుచు లేఖలు వ్రాయుచునేయున్నారు. వారికి నా ధన్యవాదాలు. రసజ్ఞమూర్తుల కీ పాంచజన్య కవితామహాఘోషము తోషమిడుగాక యని యాశింతును.

కాకినాడ
10-2-81

— గ్రంథకర్త

# పీఠిక

ఈ "పాంచజన్య" రచయిత జ్ఞానానందకవి. ఈయనకు కవికోకిల, కవితావిశారద యను రెండు బిరుదులు కలవు. ఈ నాడు బిరుదము లేని కవియే లేడు. ఉన్న బిరుదములయొక్క సార్థక్యము నిరూపింపబడినచో నది యాకాలముయొక్క గొప్ప. ఈరెండు బిరుదముల కర్థము- మధురముగాఁ గవిత్వము వ్రాయగలవాడనియు, రచనలోని రహస్యము తెలిసినవాడనియు.

మాధుర్య మనేక విధములు. మధురముగాఁ గవిత్వము వ్రాయుట యనగా కొందరి కొకటి మధురము. మరికొందరికి మరొకందు మధురము. ఈ మాధుర్యము రెండు విధములు. మొదటిది శబ్దగతము. రెండవది అర్థగతము. శబ్దగతమైన మాధుర్యము చాలమందికిఁ దెలియును. పద్యములయొక్క ధారాశుద్ధి అచ్చులయు, హల్లులయు కలయికలోని యొక శ్రావ్యతయు మాధుర్య మనవచ్చును. కొంచెము కొంచెము వృత్త్యనుప్రాసము కలిసినచోఁ దెలుగుకవిత మధురముగా నున్నట్లు కనపించును. ఈయన కవిత్వములో నీ లక్షణము లన్నియు సమృద్ధిగా నున్నవి. ఈ కావ్యము జాగ్రత్తగాఁ బఠియించిన యెల్లరును నితని కవిత్వము మధురమైనది యనియే యనుకొందురు.

భాగవతమాధుర్యమనగా చెప్పిన భావములు సర్వజనప్రియములుగా నుండుట. వానిలోఁ గొంత చమత్కారము కూడ కలిగియుండుట.

"కవుల వీపులు బరువెక్కగా నొనర్చి
కానుకల నిడి సంతృప్తిగా నొనర్చి"

ఇందు చమత్కారము కలదు. మాధుర్యము కలదని చెప్పవచ్చు.

"గురువుగారి యమోఘతరమైన సాధన
వరమైన గొడ్డలి పచ్చిబలము" —
"కుస్తీల నెగ్గిన భీము చేతికట్టె" —

పచ్చిబలము, చేతికట్టె ఈ రెండు మాటలు ప్రత్యేకమైన భావముతో సమకూర్చబడి భావగత మాధుర్యమును సంపాదించుచున్నవి.

"ఇట్టి కంగారు నాకయయో రుద్రుకు దుగ్ధసాగర
విహారా! భక్తకల్పద్రుమా"

ఇచట సంబోధనలు లోకోక్తియు రెండును కలసి భావగత మాధుర్యమును సమకూర్చుచున్నవి.

"బ్రతుకుఁ జాలించినట్టి యే ప్రభునకో? తొలి
జ్ఞప్తికై శిలావిగ్రహాల్ నాడు గట్టి;
కొలిచినారలు నేడింత తలచినంత
వెలయు నిముసాన మా శిలావిగ్రహములు"

ఈభావమునందు మాధుర్యము కలదు. ఇందాక్షేపణ యున్నదనవచ్చును. లేదా ప్రశంస యున్నదనవచ్చును.

"నీ పెదవులనుండి జారిన నవీన మరందము లారగింప నా
హృదయపు పాత్రలోన హృదయేశ్వరి! నింపుము ప్రేమ రాగమున్"

"చిరంతన దిగంతదంతురోద్దండ యశః ప్రభూత"

ఇట్టి రచన నిస్సంశయముగా మధురమైనది. అందుచేత కవికోకిలయన్న బిరుదము సార్థకమైనదని చెప్పవలయును.

ఈ మాధుర్యము వట్టి మాధుర్యము కాదు. గడుసుతనముతోఁ గూడిన మాధుర్యము. అనగా నీమాధుర్యములోఁ గొంత ప్రౌఢియుఁగూడ కలిసియున్నదన్నమాట. ప్రౌఢి కలిసియున్నమాధుర్యము వట్టిమాధుర్యము కంటె గొప్పది.

"సింగమవై దగా బ్రిటిషుజిత్తులమారి సృగాలముఁన్ జగా భంగమొనర్ప లేపిన" ఇందులో దగా, జగా, యన్న రెండు శబ్దములు రచనకు ప్రౌఢిని గూర్చును.

"నాభ్రూసితభాగపుం బసుపుబొట్టు నపాకరణంబొనర్తువా"

ఇందు నోజోగుణముతోఁ గూడియున్న ప్రౌఢి కలదు.

"చెల్లెంబూఁవ్వపు పోకడల్ విపులసచ్ఛ్రీభోగ భాగ్యాలు రంజిల్లన్ తావులు లేవు నీ సుకవితోన్మేషంబు పెంపొంద నాస ల్లేవింతకు" ఈ చివరి ప్రాసమును కూర్చుట తెనుగుపద్యరచన లోని గడుసుతనము.

"మదీయాస్యగంధ మ్మాఘ్రాణము జేసి నావచనముల్ దప్పైన దండింపవే" అన్నస్థలములందలి ప్రాస యదుకుట నట్టిదో నిదియునట్టిది. మరియు నితడు పాండిత్య స్ఫోరకములైన పలు ప్రయోగములు చేయును.

"పులిభిస్సటన్ మెసవి భరతపౌరుషవ్యోమ శుంభద్ఘు రాంబురాశి" ఇట్టికూర్పులు కవితకు నడుపు తెచ్చును. నడుపు

లేని కవిత తేలిపోవును. ఇతడు భూమికలో కవిత్వమునుగూర్చి తనకుగల యభిప్రాయము నిట్లు వాక్రుచ్చెను. కవిత్వమునకు గొప్పతన మాపాదించునది యనుభూతియేగాని మఱొండు గాదు. ఈరహస్యము తెలిసినకవి గొప్ప కవికాకుండ నెట్లుండ గలడు ?

"రెడ్డినాథుల కరుణార్ద్ర దృగ్విశేష
గాఢతర బంధురంబగు కంబమందు

వెలిగె నానాడు సుకవిజ్యోతి జ్వాలపుదివ్వె" ఈ కల్పన మిక్కిలి మధురముగా నున్నది. తెలగుదేశాన దొలగిపోయిన యొక సంప్రదాయము. శిల్పమునందు మాత్రమే కనిపించు చున్న దీపస్తంభములు, దివ్వెలు మొదలైనవాని నాశ్రయించి కలిపించిన యలంకారము.

శ్రీనాథుని మొదలు సీసపద్య మొక యూపును తెలుగు బాసలో దెచ్చినలవాటు కవులకైనది. మధురకవులని ప్రశస్తి పొందిన సర్వకవులయందు సీసపద్యములలో నీయూపు కనిపిం చును. ఆయూపు విలక్షణములయిన శబ్దముల కూర్పుచేతను, సీసచరణములో రగణ తగణ నలనగముల యధికమైన సమ కూర్పుచేతను చరణాంతముయొక్క విరతిచేతను నాల్గు చరణ ములు నొకటే నమూనాగా వ్రాయుటచేతను సమకూడును.

"ఏమిగొప్ప సదస్సులో మానెడు వరాలు
కవికి తొల్లిట రెడ్డిధవు డొసగుట"

"ఇది తొక్కబడిన యస్పృశ్యజాతి గృహమ్ము
గడుసుబాపడు విందు గుడుచుటేల ?"

ఈ మొదలైన సీసపద్యములే గాక ఎగురుచున్నది, పలుకుచున్నది, నడచుచున్నది, కులుకుచున్నది, ఇది యొక గణము. వెలిగించుకొనవోయి, కట్టించుకొనవోయి, నడిపించుకొనవోయి, సాగించుకొనవోయి, ఇది యొక గణము. సీసపద్య ప్రతిచరణాదియందు నీశబ్దములు నిక్షేపించుటచేత సీసపద్య మదొకనడక నడచును. నీపూరికొంపలో, నీగర్భగోళాన, నీరక్తనాళాల, నీస్పృహాసౌధాన, ఇదియొక గణము. చల్లారెనే, అణగారెనే, ఆగిపోయెనే, నశియించెనే, ఇది మఱొక గణము. ఇట్టి వాని స్వీకరణముచేత సీసపద్య మొక నడక నడచును. ఆసీసపద్యమున కొక సొంపు వచ్చును. ఇతని సీసపద్యము లన్నియు నొకానొకయిట్టి మెలపు నాశ్రయించినవే. ఈకాల మునఁ జాలమందియభిప్రాయము సీసపద్య మిట్లే యుండవలె నని. తక్కినవిషయ మెట్లున్నను సీసపద్యరచనలో నిట్టి మార్గ మవలంబించినవాడు మధురకవి యనిపించుకొనును.

ఈతని మాధుర్య సామగ్రి ఇతని ప్రౌఢి కొంతయున్నది. ఆప్రౌఢిచేతనే యితని కవిత యధికాదరణీయమగుచున్నది.

"నన్నయ్య హృత్సీమ నట్టువఁ ద్రొక్కుచు
పూతగౌతమి గంగ నీతఁ గొట్టి"

"తొలినాటి తెలుగుపూవుల తోపులోన, న
న్నయ్య తేనెను ద్రావి యలరునాడు"

మొదలయినవి.

“డిల్లీ కన్నులుఁ దేరుకొన్నయవి నీ శివిం బ్రదర్శింప లాల్
ఖిల్లాపై బసుపుంబతాకము సెలంగెన్ గప్రపుంబూలమై
జల్లెన్ హిందుధరాలలామయు సుమస్సంధ్యారుచిం దేలె మా
పల్లీపక్కణముల్ పురాతనపు సంపత్కీర్తి మాకబ్బతన్”

“ముదురుకులాల సాంఘికపు మోసములోఁ బడి మ్రగ్గిపోయి పెన్
బదవలుపడ్డ స్వీయకుల భారముఁ దోరము మోసినట్టి సౌ
హృదము గట్టి దాత్మమణి వీవు స్వజాతిచరిత్రలోన నీ
కొదవు పసిండి పూజలు గుణోజ్జ్వల భాసుర! దీనబాంధవా!”

ఇట్టి పద్యములలో కూర్చిన కూర్పు మాధుర్యమును దాటి ప్రౌఢివైపునకు మొగ్గుచున్నది.

ఇతని కొన్ని భావములు చాల విచిత్రముగా నుండును. ఆలోచనా పూరితములై యుండును.

“శాసనాల్ వల్ల నీ నిందారూపకమైన భేదములు సంధింపంగ వీలున్నదే” శ్రీకృష్ణదేవరాయలవారిని సంబోధించుచు

“వర్ణాన కలంగి క్రుంగునను న్యాయము నేడును గాక నీదు సంస్థానమునందుగూడ గలదా?” అని యడుగుచున్నాడు. ఇంకొక చమత్కారము.

“కాలికి గండపెండెరము గట్టిన నీ సముఖాన నేను భూ
పాలక యున్న గగ్గెరను పాదమునం దొడగంగ నాస రా
జాలదు కాని నాకు నెద జక్కనికైత వసంతకాల వృ
క్షాల వసించు కోయిలల గానముఁ దీయగ నాస గల్గెడిన్”.

చాలమంది కవులు తమ కాలికి గండపెండరము కావలె నందురు. ఇతడక్కర లేదనుచున్నాడు. వసంతకోకిలమువలె తాను పాడుకొనుటయె తనకు జీవితపరమార్థముగా భావించుచున్నాడు. నిజమైన కవియొక్క లక్షణమిది.

ఇతని కవితలో సర్వత్రి తన కులము తన పేదతనము రెండును తలయెత్తి చూచుచుండును. ఈ కాలపు కవులకు ఈ వర్ణమునందు పుట్టిన కవులకు నిదియొక లక్షణమేమో యని యనిపించుచున్నది. చాలమంది కవులు తమ దారిద్ర్యమును గుఱించి వ్రాసికొందురు. వారన్నివర్ణములయందునను గలరు. తనవర్ణమునుగుఱించి ఈ వర్ణములో జనించిన కవులు వ్రాసికొనుటయుగూడ సహజమె. కాని తన వర్ణములో నీకాలమున తనవంటి సత్కవు లెంతమంది పుట్టినారు? ఈకాలము తనజాతి కళంకము నెంత తుడిచివేసినది? తెనుగు సరస్వతి తన వర్ణము వారిని వచ్చి యాశ్రయించినదా యన్నట్లున్నదే. అట్టిభావము లీ కావ్యమునందు లేవు. పూర్వకాలపు టాచారములు, పూర్వకాలపు తమ దుఃస్థితిని పొగడుట గలదు. నేటి తమ చాలవరకు బాగుపడిన సుస్థితిని భావించుటకూడ యీ కవియందు గలదు.

"ఇది దేవళము ముఖమ్మింత చూడని జాతి
పొరిది గర్భపుగుడిన్ జొచ్చుటేల ?
ఇది తరాలకొలంది చదువెఱుంగని యిల్లు
చిన్నారి వాణి పసింపనేల ?

ఇది యేలుబడి సేయ నెపుడు కోరని జాతి
పాలించు మంత్రిత్వపదవి యేల?"

ఈ పద్యభాగము తన కృతిభర్తయైన శ్రీ సంజీవయ్య గారిని మెచ్చుకొనుటయే కాని నిజానకు దేశముపొందిన సౌభాగ్యముగాదా! ఈసంగతినికూడ ఈకవి గుర్తించియే వ్రాసెను. ఇంతమాత్రమే కాదు. ఈ కవి గ్రామము బొబ్బిలివద్ద నున్న పల్లెటూరు (పెద్దపెంకి). బొబ్బిలినిగుఱించి పద్యము లిందున్నవి.

"సేనావ్రజమ్ము ఖడ్గాన వైరులఁజంప
తనువున వీరగంధంబు పూసి—

.............................

విశ్వరంగమున పేరుగాంచి సెలంగు మేలి
సిరుల కిరవైన బొబ్బిలిపురము నాది"

అని యీకవి గర్వపడుచున్నాడు. ఆతనువున వీరగంధమునుఁ బూసినవారిలో వీరభటులై యితని పూర్వులు లేరని యెటుల చెప్పగలము? ఆనాడు హరిజనులు శాంతివేళలపొలము దున్నినవారు. యుద్ధవేళల కత్తి పట్టినవారు. నిజాని కాకాలమును నీకాలము సరిగా నర్థముచేసికొనలేదు. ఇతని బెబ్బులి పులిపౌరుషసాహిత్యము, మిక్కిలి గొప్పది.

"శత్రుల సాము చేతను
వల్లమాలిననాటి చిల్లపెంకు"

బొబ్బిలిలో నొక బావి యున్నదట. ఆబావినీరు, ప్రక్కనున్న చిల్లపెంకులపై బడినచో నా రెండు చిల్లపెంకులు దెబ్బ

లాడుకొనెనట. ఇది కథ. తరువాత ఫ్రెంచివారు దానిని పూడ్పించినారట. అధునాతనవిద్య వ్యాపించక పూర్వము తెలుగుదేశాన పల్లెపల్లెలో పసిబాలురీ కథను చెప్పికొనెడు వారు.

"కలహాక్షోణినిఁ గూలియున్న పృతనాకంకాళముం గాంచి పొంగులు వాఱన్ దనువెల్ల వీరరసమున్ గ్రోధోద్ధతిన్ వాడి ర వ్వాల బాకున్ ఝళిపించి శాత్రవుల గర్భంబందుఁ బన్నుండు బె బ్బులి మా పాపయసంచరించిన పొలమ్ముల్ గాథకం

సార్హముల్."

ఈ పద్య మితని స్వగ్రామాహంకారమున కుదాహరణము. ఈ పద్యరచన యితని కవిత్వమునకు మచ్చుముక్క. పృతనా కంకాళము సేనయొక్క శవము అనగా సేన సర్వము చనిపోయె నన్నమాట. భిన్నవీరుల భిన్నకంకాళములు గావు. సేన [illegible]యు నొకటే శవ[illegible] [illegible]. [illegible] సమా[illegible] గాఢ [illegible]

'శంసార్హముల్'. ప్రశంసాశబ్దము బదులు శంసాశబ్దము వాడెను. నిరుపసర్గముగా నిట్లు వాడుట క్వాచిత్కమైన[illegible]. ఇది ప్రౌఢికి యుదాహరణము. "శాత్రవగర్భంబందుఁ బన్నుండు" తెలుగుదేశములో విరోధితో "ఓరె నీగుండెలో మేల్కొంటాను'' అనుట లోకోక్తి. శత్రువును నిద్దురపోనీయ నన్న మాట. ఇచట గర్భంబందు పన్నుండుట ఆలోకోక్తిని స్ఫురింప జేసి భావపోషణము సేయుచున్నది.

ఇతని కవిత్వము పలుచోట్ల నీదృశమైన కవితాలక్షణ ములు గలిగి రమ్యముగా నున్నది.

"వానకై గూడు కట్టుకోలేని నన్ను"

ఇందు తన దారిద్ర్యము చెప్పుచున్నాడు. కాని చెప్పు టలో నెంత రమ్యముగా చెప్పుచున్నాడు. తానొక గూడైన కట్టుకొనలేడు. తన నిస్సహాయత్వము దీనియందు వ్యంగ్య మగుచున్నది.

ఇంతవర కితని కవికోకిల, లక్షణము చెప్పబడినది. ఇతని కవితా విశారద బిరుదమును విచారింతము. ఈబిరుదము నకు రెండర్థములు. కవిత్వమును వ్రాసెడు మార్గము సర్వాంక షముగా తెలిసినవాడు అని యొక యర్థము. ఈయర్థ మిది వరకే నిరూపితమైనది.

రెండవ యర్థము పలువిధములైన కవితా మార్గములు తెలిసినవాడు అని రెండవయర్థము చెప్పినచో ఆయర్థముగూడ నితని యందు పొసగుచున్నది. ఈ కావ్యమునందు రకరకము లైన శీర్షికలు గలవు. దేశనాయకులగురించి కొన్ని పద్యములు, కవిత్వమును గూర్చి కొన్నిశీర్షికలు, వచ్చిన స్వాతంత్ర్యమును గూర్చి కొన్నిశీర్షికలు, పూర్వకవులగురించి కొన్ని శీర్షికలు, ఆంధ్రదేశమునుగూర్చి కొన్ని శీర్షికలు. 'ప్రభూ' అన్న శీర్షిక యొకటి. ఇది యొక విచిత్రమైనది. ఈశీర్షికలో కవి తన భక్తి భావమును చెప్పినాడు. అతని దైవ మేసుక్రీస్తు. అతని మోక్షము పరదైసు అది యెట్లుంచి

"మిణుకు మిణుకని వెలుగొసెడు కనుకు దీప
మే - మదీయ కుటీరాన మేళవించి
నన్ను నోదార్చు చున్నదన్నా! పరేశ!"
"పాత్రి కొంక జేన నా కుక్కిపడక కేది
జేన? దీనజనావనా! ఆనతిమ్ము"

ఇచట దేవు జేసుక్రీస్తుగాని భావనామార్గము భారత జాతీయము. ఇంగ్లీషు భాషలో Lyrics కలవు. వాని పద్ధతికి దీనికి భేదము కలదు. ఇది భారతదేశస్థుని రచనా పద్ధతి, బైబలులో నున్న కీర్తన గ్రంథ వైఖరిగూడ నీమార్గమున బోదు. ఇదియొక మార్గము. భక్తిమార్గము. మరియొక మార్గమేమన కలువరింత— ఇది ఓమార్ ఖయ్యాము మార్గము. ఆపద్ధతిలో (దీనిని కొందరు మర్మకవిత్వమనుట కలదు Mystic Poetry) వ్రాసిన వారు నేటి తెలుగుదేశాన చాలమంది గలరు. వారిలో నత్తమోత్తమమైన రచన కీ రచన యేమియు తీసిపోదు.

పూర్వ చరిత్రిలో కొన్ని ఘట్టములు చాల రమ్యముగా వ్రాయబడినవి. 'రాణి సంయుక్త' తనతండ్రితో చెప్పిన మాటలు "హితబోధ" యన్న శీర్షికలో వ్రాయబడినది. అందులోని మొదటి పద్యమిది.

"మనలోనే కలహాల బెంచికొని మోమాటంబు వోనాడి గుం
జెను కొండంబలె జేసి శాత్రవులతో డీకొన్న రీతిన్ బలా
లను కోపాలనుఁ బెంచుకొన్న నిది ధర్మంబా నె? తండ్రీ! క్షమిం
చిన నేపాటిది నీకు నాకొఱకు నీ చివ్వన్ విసర్జింపుమీ!"

ఈ పద్య మేమిపద్యము ? పరమధ్వని పూరితముగా నున్నది. దేశీయు లొకరితో నొకరు పోరాడుకొనుట యెంత దుష్టమో యెత్తి చూపించుట యట్లుండగా శత్రువులతో డీకొన్నట్లు మనలో మన మొకరితో నొకరు డీకొనుట యన్న భావము మిక్కిలి హృదయంగమముగా నున్నది.

"పటువైశద్య విశాల భావకవితా వ్యాసర్షు లున్నారలు
త్కట పాండిత్య వియత్తలాపగ మహాగంభీర వీచీ సము
[illegible]
[illegible] గ్గౌను నేత్రన్ వేసి భూపాల!"

ఇట్టే చాలమంది యనుకొందురు. స్థూలదృష్టికి పెద్దన గారి గొప్పతనము తెలియదు. ఈపద్యమును వ్రాసిన దండు లక్ష్మీనారాయణగారు వ్యాఖ్యానముగా పెద్దనగారి గొప్పతనము చెప్పుటకే.

ఈ గ్రంథమున నింక ననేకములైన రమణీయ విషయయములు చూపించవచ్చును. ఇతడు మతముచేత క్రైస్తవుడు. కాని భారతీయుడు. ఆ భారతీయ లక్షణములు పోవు.

"విజయుడ నిన్ను గెల్చుట భళీ! యివి కర్మ నిబద్ధ
జాతకాల్"

ఈ భావము క్రైస్తవమతములోనిది గాదు. భారత దేశములో పుట్టిన లక్షణ మిది. నిన్నటి మొన్నటివరకు వీరి పూర్వులందరు హిందువులై యున్న లక్షణమిది. ఆ లక్షణమే ఈ కవియొక్క యాంధ్రకావ్యమునకు శోభ దెచ్చుచున్నది.

"అఖిల భారతమునకు దివ్యామృతమ్ము
జేపి రక్షించు గోమాత"

ఇదియును భారతజాతి లక్షణమే. ఈమాటకు కోపము వచ్చినచో నివి ఆ శీర్షికలో మాటాడువారి భావములు కాని నావి కావని సమాధానము చెప్పవచ్చును. ఎంత చెప్పినను దాని వాసన లేదనుటకు వీలులేదు.

ఈ రీతిగా నితడు గొప్ప కవియని, నిరూపితమైనది.

"ఇది సిఫారసులోకమ్ము ముదిమి పట్టి
మూల పడుటకు నింకెన్ని పుష్కరములు
జరుగవలయునో"

ఇది యీ కవియొక్క యాధునిక లోకముయొక్క విమర్శ. ఈస్థితి యిట్లే యున్నచో నిస్సంశయముగా నీ దేశము పాడై పోవునని యీతని సిద్ధాంతము. ఇతడు కవి. ఈ కవితా సంస్కారము బహుజన్మలదని యితని తాత్పర్యము. తాను కవి యగుట తన జన్మ చారితార్థ్యమని భావించువాడు.

"నన్ను వరించి వచ్చె నొకనాటిది యీ కవితాలలామ పే
ర్గన్న కళావిభాసిని, జరామరణంబులు లేని వాణి పొ
మ్మన్నను పోని కన్యక, నితాంత యశః కలితాభి రామ సం
పన్న తెనుంగు శారద శుభంబిక జన్మము ధన్యమయ్యెడిన్"

తనకు సహజముగా సిద్ధించిన యీకవితాకళకు సౌధము వంటి మహాకావ్యము వ్రాసి మహాకవి యగుగాతమని యితని నాశీర్వదించుచున్నాను.

విజయవాడ
9-10-55

విశ్వనాథ సత్య నారాయణ, ఎం. ఏ.

# అభిప్రాయములు

"పాంచజన్యము" ఆహా! ఎంత మంచిపేరు! మహా శంఖంపేరు. విష్ణువు శంఖంపేరు. వివిధశీర్షికల క్రింద వెలసిన పద్యాల మధుర ధ్వనులతో ముఖరించే ఖండకావ్యం ఇది. ఈ కృతి ఆంధ్ర మంత్రిమండలి సభ్యులలో ఒకరైన శ్రీ సంజీవయ్యకు అంకితం.

పుటలు త్రిప్పగానే ప్రాచీన భారతనాయకులు భీష్మాదులూ, వెళ్ళగా వెళ్ళగా ఆధునిక భారత నాయకులు జవహరు ప్రభృతులు కనబడతారు.

మధ్యమధ్య నిరాశ స్వేచ్ఛాకాంక్ష, సంక్రాంతి సందేశం ఇల్లాంటివి కొన్ని, బొబ్బిలి, కృష్ణరాయలు, హితబోధ, హెచ్చరిక, ఈవిధమైనవి మరికొన్ని ఉన్నాయి. ఈకావ్యంలో. ఒకగంటకాలం కాలక్షేపం చేయడానికి అనువుగా ఉన్నకృతి ఇది.

అక్షరరమ్యతా అర్థవత్తా అనే గుణాలు రెండూ కవితకు బాహ్యాంతర సౌందర్యాన్ని సమకూర్చేవి అయివుంటాయి. కొందరు పాఠకులు అక్షర రమ్యతను కోరుకుంటారు. మరికొందరు అర్థవత్తను అభిలషిస్తారు.

వాగర్థాలు రెండూ కావ్యకన్యకకు రెండు నేత్రాలు. ఆ రెండూ ఈ ఖండకావ్యంలో నిర్దుష్టంగా ఉన్నాయని చెప్పవచ్చు.

"కవిపరమేశ్వరుడు" అనే శీర్షికలో శ్రీ చెళ్ళపిళ్ళ వెంకటశాస్త్రులవారిని వర్ణించే పద్యాలు దివ్యంగా ఉన్నాయి. వెంకటశాస్త్రులగారి కవిపరమేశ్వరత్వాన్ని నిరూపించడానికి ఈ ఒక్క పద్యమే చాలు.

"కవులకు, కవి భూధవులకు
కవిసమ్రాట్టులకు కుకవిగజహర్యక్షా!
కవిపరమేశ్వర! నీవె గు
రువగుదువు నిజము సుమీ! నిరూపణసేయన్.

పాతబడిపోయినా బొబ్బిలి శౌర్యాగ్ని శ్రీ జ్ఞానానంద కవి జ్ఞాపకం చేయగానే ఆ గతచరిత్రఅంతా కన్నులయెదుట ఒకమెరుపులా గోచరిస్తుంది.

"రణమున రంగరాడ్విభుడు రక్తఝరీభరిత ప్రగాఢసా
ధనగరమున్ గమించి తన దాయుల గర్వము జీల్చ వాడిక
త్తిని గరమున్ ధరించిన ప్రదీప్తకథావివిధార్థ బోధ
నేడు మనపల్లెపాటల కడున్మిళితంబయి మేను పొంగెడిన్.

"శ్రీకృష్ణదేవరాయలు" జీవితలక్ష్యం చక్కగా నిరూపించి

"కవనమల్లిన ప్రతివానిగడియ యేమొ
కాని నిత్యసన్మానంబు నాణెము లిడి
చేసినావంట వారికి క్షితితలేంద్ర!
తెనుగు శారద కవి మంచిదినము లేమొ?

అంటారు. కవిభావుకత నాల్గవ చరణంలో స్పష్టంగా చూడగలుగుతాము.

"నెహ్రూ"ను గూర్చిన పద్యాలన్నీ ఒక యెత్తు. ఈక్రింది పద్యం ఒక్కటే ఒక యెత్తు.

"ఎన్ని యగ్నికొండ లెన్ని మహావార్ధు
లెన్ని నెత్తుటేట్లు లింకిపోయె
నీదు గర్భకుహరి; నెహ్రూ! జగద్బంధు!
తల్లిదేశ దీర్ఘదాస్యమునకు"

వివిధ పక్షపాతాల జంఝూటంలో విజయధ్వజాన్ని ఎత్తిన శ్రీ నెహ్రూ రాజకీయ తంత్రజ్ఞతను ఈపద్యం వార్తికం — దీనికి భాష్యం తరువాతి పద్యాలు.

సంయుక్త తంత్రికి చేసిన "హితబోధ" చాటుగా ఈనాటి హిందువులకు కూడా తగులుతుంది.

"హిందువులలోన హిందువు
లెందున సంబంధ మింతయేనియు లేక
న్నందున మన భారతమున
చిందులు త్రొక్కినవి శత్రుసేనా వ్రజముల్"

ప్రతిపద్యం హృద్యంగా ఉంటుంది. పీఠికలో శ్రీ విశ్వనాథ సత్యనారాయణ గారు చెప్పినట్లు "ఈకావ్యము జాగ్రత్తగా పఠియించిన యెల్లరును నితని కవిత్వము మధురమైనదియనియే యనుకొందురు" సందేహం లేదు.

ఇంతలలిత లలితమూ, భావప్రౌఢమూ అయిన కవిత్వాన్ని వరప్రసాదంగా పొందిన శ్రీ జ్ఞానానందకవి ఇకమీద ప్రఖ్యాతం కానీ, ఉత్పాద్యం కానీ, అయిన ఇతివృత్తాన్ని తీసికొని కావ్యాలు వ్రాసి చరితార్థులు కావాలని కోరుతున్నాను.

"యామిజాల"

(ఆంధ్రపత్రిక 17-6-1956)

## ఆకాశవాణి

విజయవాడ 13-8-1956

ఇదియొక ఖండకావ్య సంపుటి... ఇది నా కూతురు, పాంచజన్యము, కళాహేరాళ సల్లక్షణాభ్యుద, యాద్ధత్యరస స్వరూపిణి, గుణాంభోరాశి, సన్మార్గపు చదువునేర్చిన కన్య... అని మధురముగ కవిత చెప్పనేర్చిన క్రైస్తవ తెలుగు పండితుడీ కృతికర్త.

......నీ పెదవులనుండి జారిన, నవీనమరందము లారగింప...అను యీయన పద్యరచన ఎంతో మధురమైనది... సింగమవై దగా ... జిత్తులమారి సృగాలమున్ జగాభంగ మొనర్ప లేపిన సిపాయిల బేరున...దండుగా...అని సుభాసు బాబునుగూర్చి వ్రాసిన పద్యము కేవలము వట్టిమార్దవమే గాక గడుసుదనమూ... ప్రౌఢియూగనబడుచున్నవి...పులిభిస్సటన్ మెసవి......ఝురాంబురాశి...అను కవి ప్రయోగములు కవితకు సడువుదెచ్చుచున్నవి. ఈయన సీస పద్యాలు శ్రీనాథకవి పోకడలె; నాల్గుపాదాలు ఒకేరీతి, తీరు, నడకగలిగి ఒక విధమైన యూపు, మెలపూ, సొంపు గలిగియుంటాయి... విశ్వరంగమున పేరుగాంచి సెలంగు మేలి సిరుల కిరవైన బొబ్బిలిపురము నాది... అని స్వగ్రామాన్ని గూర్చి సగర్వముగ చెబుతాడు.

...శాత్రవుల గర్భంబందు పన్నుండు బెబ్బులి మాపాపయు సంచరించిన పొలమ్ముల్ గాథశంసార్హముల్...

ఇక్కడ గర్భంబందు పన్నుండుట అన శత్రువుల గుండెలో మేల్కొంటాను, అను తెనుగు సామెతకు బదులువాడి కవి భావపోషణము చేశాడు.

...చేవగలబోటి నాకవితావధూటి...అని సగర్వము గనూ... ఇతర కవులవలె గండపెండేరాలు కోరక...వసంత కాల వృక్షాలవసించు కోయిలల గానము తీయగ నాసగర్లె డిన్...అని తన జీవితపరమావధి నిరూపించాడు... కమ్మని తేట తెన్గు నుడికారపు సొంపు రసార్ద్రమైన దివ్యభావాలు లిఖించు నేర్పు, ప్రతిభాయుతుడైన కవీంద్రునిదొడ్డగంటమ్మున నుండుగాని, కవనమ్ము రచింప నెరుంగని దద్దమ్మ కలానికీవిషయ మందున తన్నుక చచ్చెనేనియుఁ...అని సగర్వముగ పలుక గలిగెను. కవిత్వ మాతని కొకనాటి శక్తిగాదు... అది పొమ్మన్నను పోనికన్యక, నితాంత యశః కలితాభిరామ సంపన్న, తెలుంగుశారద, జరామరణంబులులేని వాణి...అని కవిత్వమబ్బుటచే జన్మ తరించినదనే భావాన్ని ప్రకటిస్తాడు.

ఈ కవి రచనలలో జాతీయతా. స్వేచ్ఛ, కరుణ, అన్యాయనిరసన మొదలగుభావాలు వివిధకవితారీతులుగలవు. వివిధశీర్షికలలోయెన్నో ఆవేశపూర్వకమైన స్వేచ్ఛాగానాలు యీ పాంచజన్యముఖాన బయలుదేరినవి.

మిణుకు మిణుకని మెరసెడు కునుకు దీపమే
మదీయ కుటీరాన......నన్ను నోదార్చు...

చున్న దన్నా......పరేశ......అనీ
విసువుబుట్టించు నా పేదబ్రతుకు......అనీ
వానకై గూడు కట్టుకోలేని నన్ను......అనీ
రెండు జానల నేలైన లేదు నాకు
బికిరమెత్తుకొని నేను జీవించు కొఱకు
పాత్రికొక జాన నాకుక్కి పడక కేది జాన
దీనజనావనా...ఆనతిమ్ము......అని

భగవంతునిగూర్చి అత్యంత మధురములైన దీనాలాపములతో తన హృదయాంతరమునందుగల భక్తి భావాన్ని ప్రకటించుతాడు. ఈ "పాంచజన్యము" కవితాధారాస్యందినియై మరందము లొలికించుతూ చదువుట కాహ్లాదకరముగ నుండుటయేగాక చదివిన కొలంది పాఠకుల హృదయాలలో మరింత భావనా సౌందర్యాన్ని కూడ పరిస్ఫుటింప జేస్తోంది.

*   *   *   *

"Panchajanyamu" by Gnanananda Kavi is a collection of poems on 26 miscellaneous topics. The Author is, obviously; endowed with the gift of pleasant versification and a poetie imagination. His poetry is rather subjective breathingforth feelings that are choked up and long suppressed. Viswanatha satyanarayana has contributed an elaborate foreword.

Hindu. 28-7-1957

## నాటి కృతి సమర్పణ

"జాతిని మేల్కొల్పి జాతి సంస్కృతిని తరతరాలుగా నిలువబెట్టి తజ్జాతి పురోగమస్థితికి నిర్విరామ కృషిచేసే కవులను ప్రభుత్వం ఆదరించి పోషించాలి.

ఈనాడుకవులను ప్రభుత్వం ప్రోత్సహించి వారిచే దివ్య కావ్యరచనలు గావింపజేయాలి" అని సహకార శాఖామాత్యులు శ్రీ సంజీవయ్యగారికి "కవికోకిల" "కవితావిశారద" శ్రీజ్ఞానానందకవిగారు తమ "పాంచజన్యము" కృతిని సమర్పించే సందర్భంలో శ్రీ ఆర్. బి. రామకృష్ణరాజుగారు (ఎం. ఎల్. ఏ.) శాసనసభ్యుల క్లబ్బుతరపున న్యూ ఎసంబ్లీ హాస్టల్ ఆవరణలో నేర్పాటు చేయబడిన సభ కధ్యక్షత వహిస్తూ అన్నారు.

"జ్ఞానానందకవిగారు రచించిన పాంచజన్యము కృతి స్వీకరణోత్సవ శుభసమయంలో నే నధ్యక్షత వహించడం నా అదృష్టం. శ్రీజ్ఞానానందకవి చాలా కావ్యాలు వ్రాశారు. తెలుగువారిమన్ననల నందారు. నేడు మంత్రి శ్రీసంజీవయ్య గారికి కృతినివ్వడం సముచితంగా ఉన్నది. తనజాతి నాయకుడు రసజ్ఞుడునైన శ్రీసంజీవయ్యగారు ఈ కృతిని పొందుట గూడ విశేషభాగ్యం. ఇటుల కృతుల నంది కవులనుసన్మానించే ఆచారం మన తెలుగు వాఙ్మయంలోని సత్సంప్రదాయం. శ్రీ సంజీవయ్యగారు కృతికర్త నెట్లు సత్కరిస్తారో మనం

చూడాలి. అని కూడా శ్రీ ఆర్. బి. రామకృష్ణరాజు (ఎం. ఎల్. ఏ) గారన్నారు.

శ్రీ మొక్కపాటి నరసింహశాస్త్రిగారు ప్రారంభోపన్యాసం చేస్తూ ఇలా అన్నారు.

"శ్రీజ్ఞానానందకవిగారు నాకు చిరపరిచితులు. శ్రీవిశ్వనాథ సత్యనారాయణగారి ప్రియశిష్యులు. కావున వీరి కవితాశక్తిని పరామర్శించుట తేలికయైన పనిగాదు. శ్రీ జ్ఞానానంద కవిగారి రచన అమృతమయము. నేటిస్వీకరణోత్సవంనాడు నేను ప్రారంభోపన్యాసం చేయుట నా అదృష్టమని తెలుస్తూ నని 'సప్తసంతానములలో ప్రశస్తిగాంచి ఖలముగాకుండునది ధాత్రికృతి" అన్న పెద్దన్నగారి దివ్యవాక్కులలో గలదూరదృష్టి మనం గ్రహించగలం. కృతి శాశ్వతత్వం యిస్తుంది. మంత్రి సంజీవయ్యగారికి ఈపాంచజన్యకృతి శాశ్వతత్వం కల్పించింది. శ్రీ సంజీవయ్యగారు యువకులు, ఉత్సాహవంతులు, వీరికి ఈకృతి శ్రీ జ్ఞానానందకవి గారివ్వడం బంగారమునకు పరిమళ మబ్బుట" అంటూ గద్య పద్య రచనలోని రహస్యాలు ముచ్చటిస్తూ కృతిపతిని, కృతికర్తను ఆశీర్వదించారు.

పిమ్మట శ్రీ జ్ఞానానందకవిగారు తమ పాంచజన్యకృతి మంత్రి శ్రీ సంజీవయ్యగారికి ఎందుకు ఇవ్వవలసి వచ్చిందీ చెబుతూ మంత్రి శ్రీ సంజీవయ్యగారు తమ కుల రత్నమని విద్యాధికులకు, రసజ్ఞులకు అసలు కృతినివ్వడం పుచ్చుకోవడం రూపకాలంకార మేనని ఆనందం పొందుటలోనే సృష్టి వైచి

త్త్యమున్నదని అంటూ నన్నయ్యనుండి నేటివరకు వచ్చిన సాహిత్యంలోని పరిణామములు వివరిస్తూ సాహిత్యాన్ని ప్రభుత్వం ప్రేమించి నిర్ధనులైన కవులకు భృతి కల్పించవలసిం దిగా ప్రభుత్వాన్ని అభ్యర్థిస్తూ తమ కృతిని గానంచేసి శ్రీ సంజీవయ్యగారికి చందన తాంబూలం ఖద్దరు శాలువతో కృతి సమర్పణ గావించారు.

మంత్రి శ్రీసంజీవయ్యగారు కృతిస్వీకరిస్తూ నాది పెద్ద పాడు కర్నూలునకు సమీపం. శ్రీ జ్ఞానానందకవిగారిది పెద్ద పెంకి బొబ్బిలి సమీపం. వీరికవితాకన్యను నేను గ్రహించుట అదృష్టం. కాని ఈ పెంకిపిల్లను నే నెట్లు యేలగలను? అని అనుమానిస్తున్నాను అని అన్నారు. శ్రీ జ్ఞానానందకవిగారితో తమకున్న పరిచయాన్ని వారి కవితా వైదగ్ధ్యాన్ని ప్రశంసిం చారు. పూర్వం రాజులు కవులను సత్కరించారని ఆరోజులు మారాయని ఈ ప్రజా స్వామ్యయుగంలో శ్రీమంతులైన ప్రజలు కవుల నాదరించాలని చెప్పి శ్రీ జ్ఞానానందకవిగారికి 116 రూపాయలు, చందనతాంబూల శాలువా సమర్పించారు. పిదప శ్రీ. డి. ఆర్. ఎల్. నరసింహంగారు శ్రీజ్ఞానానంద కవి కవితా ప్రాశస్త్యాన్ని ప్రశంసించారు.

సభాప్రారంభంలో శ్రీ మూర్తిరాజు (ఎం. ఎల్. ఏ) గారు కవిని సభికులకు ఎరుక పరిచారు.

సభకు పలువురు శాసనసభ్యులు వచ్చారు. శ్రీ మూర్తి రాజుగారి వందన వాచకతో సభ ముగిసింది.

(ఆంధ్రప్రభ 4-10-1956)

# అంకితము

శ్రీదామోదరవంశ భూషణుడు ప్రస్ఫీతోత్కళాశ్రీ రసా
స్వాదుండాఢ్యగుణైకచిత్తుఁడు, జగాసన్న్యాసి శ్రీగాంధి సూ
త్రా దర్శోన్నతభావపున్ శిఖర మార్గాటుండు! నాకావ్య ల
క్ష్మీ దేవిన్ గరమందె మంత్రిమణి! సంజీవయ్య! యానం
దమున్"

"ఇది నా కూతురు "పాంచజన్యము" కళాహేరాళ సల్లక్షణా
భ్యుదయాహ్లాద రసస్వరూపిణి, గుణాంభోరాశి! సన్మార్గపున్
జదువు న్నేర్చిన కన్య కోరెనది నానందంబు పొంగార, మె
చ్చెద వీవంచు రసైకసాధునుతి! సంజీవయ్య! నిన్ను న్వేసన్"

నీ సుగుణాలు నీ ప్రశుభ నిర్మల దివ్యమనోజ్ఞ మంజు సు
శ్రీ సముదీర్ణ భావములు చెప్పినవెంటనె గాక నీకళా
భ్యాసము నీదు జాలిగల స్వాంతమునం గనిపెట్టి నీదు సా
వాసముఁ గోరుకొన్న యది పంకిత! యెట్టుల నాదరింతువో?

ధ్వనియించినది ప్రతిధ్వను లీన నాంధ్రాన
నీ జయారంభవాణీ రవమ్ము
వెలిగించినది యశః కులకాంత రాజాజి
మంత్రిత్వమున నీ సమత్వదీప్తి
పరిమళించినది తపస్వి గాంధియుగాన
దయివార నీదు మేధాప్రసవము

నడిపించినది త్రివర్ణ ధ్వజచ్ఛాయలో
దిగులొందనట్టి నీ దేశభక్తి
వట్టి పేదవారి వాకిండ్లు సూడగా
అరుసమందినది త్వదాత్మ నిజము
మాననీయ! మహిత మంత్రి సంజీవయ్య
ఈ సుకృతి కుమారి నేలుకొనుము.

నలభై యేండ్ల తపస్సుకున్ ఫలిత మీ నవ్యాంధ్ర
రాష్ట్రమ్ము, రా
ముల దీక్షావిభవానఁ దెల్గుల శుభంబుల్ మొగ్గలై పూవులై
ఫలియింపంబడుచున్న వేళ; తొలి మావంశంపు పుణ్యాన రా
జిలినావయ్యా! తెనుంగు మంతిరిగ సంజీవయ్య! చిత్రంబగున్.

కిసమసలు పడిన పేదల
యుసురులలో వ్యథలఁబడుచునున్న తలంపున్
పసిగట్టి నసిగఁ జూచు, త
వ సుహృద్భావము నిజమ్ము ప్రణుతింపఁదగున్.

గుడిసెన్ బుట్టిన యాదిమాంధ్రునకు మేల్కొల్పు న్నిరీ
హన్ గడుం
గడు వృద్ధుండు క్షమాప్రవాసి యగు శ్రీ గాంధీయొకం
డెప్పుడో
బెడగున్ శంఖము నూదఁ దత్స్వనపుటావేశాన స్వాతంత్ర్యమై
నడుమున్ గట్టిన జాతి నాయకుఁడవన్నా! నీకు బ్రహ్మాయువౌ.

ఇది త్రొక్కఁబడిన యస్పృశ్య జాతిగృహమ్ము
గడుసుబాపడు విందుఁ గుడుచు టేల ?
ఇది దేవళపు ముఖమ్మింత చూడని జాతి
పొరిది గర్భపుగుడిన్ చొచ్చుటేల ?
ఇది తరాలకొలంది చదువెఱుంగని యిల్లు
చిన్నారివాణి వసింపనేల ?
ఇది యేలుబడి సేయనెపుడు కోరని జాతి
పాలించు మంత్రిత్వ పదవి యేల ?
మునుపు కాలసృష్టి మోసాన హరియించె
నా కులంపు సత్తి నాడెములను
మఱల నేడొసంగె మంత్రి సంజీవయ్య !
సృష్టి మర్మముల గ్రహింపఁ దరమె ?

బలకాయించి మహానుభావుఁడు; దయావారాశి! బాపూజి వా
క్కులకామోదము చూపి తద్విధము నీకున్ గల్గు సర్వస్వమున్
బలిగావించి స్వదేశమున్ గొలుచు నీ నైర్మల్య భావానకున్
తెలుగున్ జాతికి మంత్రి! మెప్పులివె సంజీవయ్య! విద్యాఖనీ!

ముదురుకులాల సాంఘికపు మోసములోఁబడి క్రుంగిపోయి పెన్
బదవలువడ్డ స్వీయకులభారముఁ దోరము మోసినట్టి సా
హృదముఁ గలట్టి దాతృమణివీవు; స్వజాతి చరిత్రలోన నీ
కొదవు పసిండిపూజలు గుణోజ్జ్వల భాసుర! దీనబాంధవా!

ఈ చిన్నికొంపలోనే జన్మమెత్తిన
మా యరుంధతి లోకమాన్యయయ్యె
ఈ లేమియింటిలోనే యల్ల శబరమ్మ
పట్టాభిరాముని పలికలందె

ఈ వంగడంబుననే శౌర్యాధియైన
కన్నమనీడు ప్రఖ్యాతి దనరె
ఈ దీనజాతియందే బాలయోగి ని
శ్చలతపస్సు జగమ్ము నలర జేసె
పౌరుషమున బ్రతికి బట్టగట్టిననాటి
సిరిజనుండు నేడు హరిజనుండు
పూర్వసుకృతి మఱలఁ బొలుపారఁగా వృత
సుజన వందితా! హరిజన మంత్రి!

కొనకొని తేనెలూర రసగుంభనపుంబలుకుల్ రహించగల
మ్మున సరిపోషణింతువు, ప్రభూతిపురాకృత పుణ్యమున్ గత
మ్మున; నిను వాణియు న్వలచెఁబో; నిను లక్ష్మి వరిం
చెఁబో; యశ
మ్మున నలరారు మింక గుణపుంజ విభాస! కళాభిరంజనా!

కట్టా! దిక్కులు కండ్లుమూసినను పక్కా నీలమేఘాలు పెన్
దట్టంబై గగనమ్ము నిండిన మహౌదార్యస్వరూపమ్మునన్
జుట్టాలెంటువంటి పంచములకున్ తోషాన భూదానపున్
పట్టాలిచ్చిన నీ చరిత్రకు దయాబంధూ? నమోవాకముల్.

తొలిగా మంత్రివై తెలుంగు జగతిన్ తోరానఁ బాలించు ధీ
గల నీకున్; కవిగా తెలుంగు జగతిన్ కాల్పెట్టు నాకున్ మహో
జ్జ్వల సంబంధము నిల్పుకోగ భువి నస్మత్ కావ్యకన్యామణిన్
చెలువు స్నీకు నొసంగితిన్ తెలిసి! సంజీవయ్య! కైకోగదే?

కవిలోకమునకు నగ్రిణి! కవిసమ్రాట్టు
విశ్వనాథుని కృపావిభవమంది
తెలుగు నాయకుడు నా కళ మెచ్చుకొన్నట్టి
కాళేశు నిండారు కాన్కలంది
గోనబార బెజవాడ గోపాలరెడ్డి మం
జుల భావనిపుణు మెప్పులను వడసి
శైరీష కుసుమ పేశల సుధాకవిమూర్తి
జాషువాసుకవి ప్రశంసలంది
నా సువర్ణసుస్నిగ్ధ రత్నాలవల్లి
పున్నమిని గెల్చు కడగొట్టు కన్నబిడ్డ
కావ్య సుకుమారి కీర్తిని గంపకెత్తి
వచ్చెనిదిగో దామోదరాన్వయ విభూష!

పెబువుల కాలమందు కవివీరులు బువ్వకు లోటులేక, తా
ము, బహు మహోల్లసిత పుస్తకముల్ రచియించినారు, నే
డు, బబువులన్న మంత్రులె, కడుంగడునందు గవీంద్రుడీవు పై
కొబుకని విద్యదీక్షాచరితోత్తమ! నన్ను ననుగ్రహింపుమిా?
"సగదాగా సరసంబుగాఁ గవనమున్ సాగించు నీ శక్తికిన్
గరువించు న్నిఖిలాంధ్ర భూమి సుయశస్కా! పాండితీ శ్రీధురం
ధర! విద్వజ్జనభూష! దీనజనవంద్యా! కీర్తిధారేయ! మం
తిరి సంజీవ సమాహ్వయా! శుభము ధాత్రిన్నీకు దీర్ఘాయువౌ!"

కళలు వెలయునట్టి గ్రామమ్ము నీయది
"పెద్దపాడు" నాది "పెద్దపెంకి"
పిల్ల నిచ్చినాడ నిలాలుగా నీకు
మంచివాడవంచు మంతిరయ్య!

జ్ఞానానందకవి

# కృతజ్ఞత

కవులన్నన్ గవితాప్రసంగము లనన్ గాటంపుటాసక్తి మై
మివులన్ జూపి కళాసరస్వతిని నెమ్మిన్ బూజలన్ సల్పి స
త్కవులన్ దన్పుచు ధర్మబుద్ధికి శిరఃకంపమ్ము గావించు ది
వ్యవదాన్యోత్తమునిన్ నుతించెదను రామాచారిధీశాలినిన్.

వేడ్కమై సుకవితాపీయూష వారాశి
    స్నానమాడిన రసజ్ఞప్రభుండు
విశ్వవిశ్వంభరా పృథుల సౌభాగ్యమ్ము
    స్వాంతానఁగోరిన సాధుమూర్తి
అతినిరాదరులైన యలఘుసత్కవులకు
    నానంద మిడిన సదాశయుండు
కవితాప్రపంచాన భవభూతిచరితమ్ము
    నాలపించిన కళాహేళి! హాళి!

ధర్మచింతనమున కర్మవీరునిగాఁగ
మసలుచున్న నవ్యమానవుండు
డాబులేని శ్రీసరాబు రామాచారి
కమృతహృదికి ధర చిరాయురస్తు.

హృదయముగల్గి మానవత కెంతయు దోహదమిచ్చి ధర్మపున్
పథమున సంచరించి సుగుణమ్ములప్రోవుగ నిల్చి పెద్దగా
చదివి తెలుంగుసాహితికి సంతస మిచ్చిన పుణ్యమూర్తి కిం
పొదవు సరాబువంశమణి కుజ్జ్వల భాగ్యపరంపరావళుల్.

— జ్ఞానానందకవి.

# విషయసూచిక


| | | | |
|---|---|---|---|
| 1. | విశ్వభారతి | ... | 1 |
| 2. | కావ్యకన్య | ... | 3 |
| 3 | దోసిలి | ... | 4 |
| 4. | బొబ్బిలి | ... | 6 |
| 5. | ప్రభూ | ... | 10 |
| 6. | శ్రీకృష్ణదేవరాయలు | ... | 14 |
| 7. | కవిపరమేశ్వరుడు | ... | 19 |
| 8. | కర్ణుడు | ... | 22 |
| 9. | భీష్ముడు | ... | 25 |
| 10. | కిరీటి విషాదము | ... | 27 |
| 11. | కృపాభిక్ష | ... | 30 |
| 12. | నెత్రూరు | ... | 34 |
| 13. | తెలుగుతల్లి | ... | 37 |
| 14. | కృతజ్ఞత | ... | 39 |
| 15. | కలువరింత | ... | 44 |
| 16. | హితబోధ | ... | 47 |
| 17. | సుభాసుబాబు | ... | 50 |
| 18. | ఎఱుక | ... | 56 |

19 నిరాశ ... 58

20. సంక్రాంతి సందేశము ... 65

21. పకేలు ... 68

22. స్వేచ్ఛాకాంతు ... 70

23. హెచ్చరిక ... 74

24. రాష్ట్రవిజయదుందుభి ... 78

25. శ్రద్ధాంజలి ... 82

26. అంబేద్కరు ... 84

# విషయసూచిక


1. విశ్వభారతి ... 1
2. కావ్యకన్య ... 3
3. దోసిలి ... 4
4. బొబ్బిలి ... 6
5. ప్రభూ ... 10
6. శ్రీకృష్ణదేవరాయలు ... 14
7. కవిపరమేశ్వరుడు ... 19
8. కర్ణుడు ... 22
9. భీష్ముడు ... 25
10. కిరీటి విషాదము ... 27
11. కృపాభిక్ష ... 30
12. నేత్రాలు ... 34
13. తెలుగుతల్లి ... 37
14. కృతజ్ఞత ... 39
15. కలువరింత ... 44
16. హితబోధ ... 47
17. సుబాసుబాబు ... 50
18. ఎలుక ... 56

| | | |
|---|---|---|
| 19 | నిరాశ | ... 58 |
| 20. | సంక్రాంతి సందేశము | ... 65 |
| 21. | పకోలు | ... 68 |
| 22. | స్వేచ్ఛాకాంక్ష | ... 70 |
| 23 | హెచ్చరిక | ... 74 |
| 24. | రాష్ట్రవిజయదుందుభి | ... 78 |
| 25. | శ్రద్ధాంజలి | ... 82 |
| 26. | అంబేద్కరు | ... 84 |

# విశ్వభారతి

ఎగురుచున్నది జగా మగరాల తొలిసంజ
కళలీను మూఁడు వన్నెలపతాక
పలుకుచున్నది మునిబ్రహ్మ మోహనదాసు
శాంత్యహింసల మహాశక్తి వాణి
నడచుచున్నది ప్రాక్తన న్యాయనైపుణ్య
సత్కళాధర్మ యోషాలలామ
కులుకుచున్నది మొన్న తెలవారిబంధాలు
సడలించుకొన్న స్వేచ్ఛాపురంధ్రి

శుభకళాంకిత విజయవిస్ఫుట విశాల
నవ్యభారతదేశ విజ్ఞానకలన
పాడుకొనవోయి! గొంతెత్తి నేఁడు లెస్స
క్షితి నభమ్ముల మ్రోఁగ భారతకుమార!

వెలిగించుకొనవోయి! విశ్వభారతకళా
కాంతివిజ్ఞానంపు కాగడాలు
కట్టించుకొనవోయి! యిట్టె స్వేచ్ఛాగృహ
ద్వారాన స్వాతంత్ర్యతోరణాలు
నడిపించుకొనవోయి! నవ్యస్వరాజ్య దీ
క్షామార్గమునను స్వేచ్ఛారథాలు
సాగించుకొనవోయి! శ్రీగాంధి సలిపిన
జమ లేని మహదహింసావ్రతాలు

పాడుకొనవోయి! నీజాతి భవ్యగీతి
నిలుపుకొనవోయి! జాతి నిర్నిద్రకీర్తి
దెసలు మార్మ్రోగ నీపేరుఁ దెలుపవోయి!
బ్రతుకు కొండంత కలిగిన భారతీయ!

# కావ్యకన్య

నన్నయ్యహృత్సీమ నట్టువఁ ద్రొక్కుచుఁ
బూతగాతమిగంగ నీతిఁగొట్టి
తిక్కన్నయజ్ఞవీథిని గాంచి మోదించి
తెలుఁగువారల దొడ్డకొలువు లంది
కవిరాజు కావ్యశృంగార కళావతీ
నాట్యంబులోని విన్నాణ మెఱిఁగి
భక్తులా బమ్మెరవారింట మధురాతి
మధురభక్తి రసంపు సుధనుగ్రోలి

హంపి విజయనగరమందు రాయలవారి
యష్టదిగ్గజముల నలరఁజేసి
విజయభేరిఁ గొట్టి పృథివిదేవత మెచ్చ
తెలుఁగు కావ్యకన్య వెలయుఁగాక !

# దోసిలి

తెలుగుంగబ్బము లల్లునట్టి కవు లీడివాంధ్రభూమిస్థలిన్
కలవా రెందరో ? వారు నీకుసములా ? కావ్యప్రపంచాన నీ
కల మెన్నోవిధముల్ జరించెడిని విఖ్యాతిం బ్రదర్శించెడిన్
పలుకన్ నీకును నీవెసాటి గురుదేవా ! సత్యనారాయణా !

కలముం బూనుచు వ్రాయనెంచెదవ గంగావాహినీ ధార లు
జ్జ్వలమై పాఱువిధాన నీదు రచనా సామర్థ్య వైశద్య ప్రో
జ్జ్వలధారా సముదాయముట్టులెగదా ! పాఱున్ యథార్థంబు ప
ల్కులరాణిన్వలపించుబ్రహ్మవు సుధోక్తుల్ నీమహావాక్యముల్

సకలాంధ్రమ్ము నమస్కరింపగ మహాసాహిత్య లోకైకభూ
ష ! కవీశానులు, భూమినాథులు త్వదీయంబైన మాధుర్యమం
జు కథాగీతుల కంజలింపగ యశః స్ఫూర్తిన్ విడంబింప వి
శ్వకవీంద్రా !మదహస్తి నెక్కితివిహర్ష ధ్వానముల్ మ్రోగగన్

తెలుగువారల గుండె లలరింప మృదుకావ్య
నిర్మాణచణుఁడవై నిలిచినావు
సరసమరంద నిష్యందమాధుర్యాన
విమలశబ్దములఁ జొన్పించినావు
బలుతైనజాతి యోధుల వీరగానమ్ము
తెలుగువీథిని బాడి కులికినావు
తెలుగుభాషా మహోజ్జ్వల దివ్యవారాశిఁ
గ్రొంగ్రొత్త రచనలఁ గూర్చినావు

ఐకమత్యంబు లేని యీ యాంధ్రజాతిఁ
గాంచి మేల్కొల్పి శ్రావ్య సత్కావ్యగాన
మాలపించిన నీకు జోహారులిడని
యనుఁగు తెనుఁగన్న లేఁడు నీ యాంధ్రసీమ!

కమనీయార్థ రసావతారధిషణా! గంభీరమూర్తీ! దయా
సముదగ్రా! వివిధార్థ కావ్యరచనా సామ్రాజ్య పట్టాభిషి
క్త! మహాంధ్రాభ్యుదయాభిమాని! విలసద్బ్రాహ్మీస్వరూపా!
గుణో
త్తమ! యౌదార్య రసస్వభావ! గురునాథా! విశ్వనాథా! నమః

# బొబ్బిలి

మల్లమ్మ దేవి శుంభత్ పౌరుషమును గా
    డెలc బోయc బెద్ద తూములను గొలిచి
రంగరాయని రణరంగ కేళీశస్త్ర
    రాజసానకుc గసరత్తు నేర్పి
పాపరాయని బాహుపై జిందులను ద్రొక్కి
    పరువంపు కత్తికిc బదును పెట్టి
సేనావ్రజమ్ము ఖడ్గాన వైరులc జంప
    తనువున వీరగంధమును బూసి

బుడుతపాపల చిన్నారినుదువులందు
కీర్తిపౌరుషరేఖ గ్రక్కించి విశ్వ
రంగమున పేరు గాంచి చెలంగు మేలి
సిరుల కిరవైన బొబ్బిలిపురము నాది.

రంగారావు ధరాతలేశ్వరుని శౌర్యంబైన రక్తంపు బొ
ట్టుం గంచున్ మది తల్లడిల్లుచును నిట్టూర్పున్ నిగిడ్చున్ లస
చ్ఛృంగారంబగు కోటముట్టడికి బుస్సీ ఫ్రెంచిసేనాని మా
యంగంబుల్ పులకించు నేఁటికిని ఆయారాటముల్ విన్నచో.

విసిపించదేల ? ఖంగున నగారా మ్రోత
కొమరార నీ ప్రాతకోటలోన
పెకలలేదేల ? మచ్చుకు గడ్డిపరకైన
తాంధ్రపావయ ధర్మధామమందు
జలమాడదేల ? భీషణరక్తధారాస్ర
వంతిలోపల శౌర్యపద్మనిలయ
వెలయింపదేల ? కత్తులసాము సేతను
వల్లమాలిన నాటి చిల్లపెంకు

తెలియదేల ? మా వెల్మవీరుల బలంబు
కానఁబడదేల ? ఘనపరాక్రమవిభూతి
నాటి మా వీరబొబ్బిలి మేటిచరిత
మ్రగ్గిపోయెనె ? భూమికంపముల కకట !

రణమున రంగరాడ్విభుఁడు రక్తఝరీభరితప్రగాఢసౌ
ధ నగరమున్ గమించి తన దాయలగర్భముఁ జీల్చి వాఁడి క
త్తి నిగరముం ధరించిన ప్రదీప్తకథా వివిధార్థబోధ నే
డును మన పల్లెపాటలఁ కడు నిర్మళితం బయి మేను పొంగెడిన్.

నాటి మా వెల్మవీరుల మేటి శౌర్య
సాహసోజ్వల కిరణజాజ్వల్యమాన
విలయకీలలు చల్లారి వెలిసిపోయె
నిండుహృదయాల బాపూజి నిలుచుకతన.

ఉడికిన శౌర్యసాహస మహోదధిలో జలకంబులాడి వ
చ్చెడు మొనగాఁడు పాపయవిశీర్ణ హృదిన్ దమి నట్టియూహాలే
పొడమెనొ? శౌర్యబీజములు మోసులువాఱెనో? రాజభక్తి యే
యొడదనుముంచ పౌరుషము నేపునఁజూపెనొ? శాశ్వతంబుకై.

ఏ సరదారు మస్తకమొ? యే సరదారుని పాదయుగ్మమో?
యే సరదారు వ్రేళులొ? మరేసరదారుని కాలిగోరులో?
యే సతి దివ్యహస్తమొ? యిసీ! యిపు డీరణభూమిలోఁ ద్రుణం
బై సెలరేగెనో మునుల కందునె? యిట్టి జగారహాస్యముల్?

కలహాక్షోణినిఁ గూలియున్న పృతనాకంకాళముం గాంచి పొం
గులువాఱన్ దనువెల్ల వీరరసమున్ క్రోధోద్ధతిన్ వాడి ర
వ్వాల బాకున్ ఝుళిపించి శాత్రవుల గర్భంబందుఁ బన్నుండు బె
బ్బులి మాపాపయసంచరించినపొలమ్ముల్ గాథశంసార్హముల్.

## ప్రభూ!

మిణుకు మిణు కని మెఱసెడు కనకదీప
మే మదీయకుటీరాన మేళవించి
నన్ను నోదార్చుచున్న దన్నా! పరేశ!
జాలి గల దొర! దీనుల నేలు వేల్ప!

విసుగుఁ బుట్టించునట్టి నా పేదబ్రతుకు
నిముసనిముసమ్ముఁ దలప గుండియ ద్రవించు
స్వార్థజను లుద్భవించిన వసుధ దారి
యీ యభాగ్యున కేది? స్వామీ! వచింప.

ఈ విశీర్ణగేహాన నా యీ దరిద్ర
దేవి తీండ్రించు కొంపను దీర్ఘకాల
బహుళకంటక జీవనవనములోన
మనుటకును నాకు గడియయు మనసు రాదు.

మిగుల భయపెట్టు నన్ను మబ్బుగమికూడ
వానకై గూడు కట్టుకోలేని నన్నుఁ
గాంచి నా జీవితమ్మును గాంచి నీకు
కఱగదా! గుండెకాయ నిర్ఝరమునట్లు.

నిన్ను శరణుఁ గోరి నీవంక నిలుచుండి
నీదు పాదసేవ నెమ్మి మీఱఁ
జేసి మ్రొక్కు నాదు దోసమా యిది యేమి?
మందలించి నన్ను మనుపుమయ్య!

దివ్యకవిత వ్రాయ తెగియింతు నంటినా?
ఱొగి విచారములకుఁ దగులుకొంటి
సృష్టిఁ జేసి నన్ను సిలుగులలో ముంపఁ
గంకణంబు నీవు గట్టినావె?

రసమయంబైన యీ దొడ్డప్రకృతిలోన
వేడినిట్టూర్పు విడిచి నేఁ బాడుకొందు
హృదయమును బెకలించి యభ్యుదయగీతి
పరమ పరదైసులో నన్ను మఱచిపోను.

రెండుజేనల నేలైన లేదు నాకు
బికిర మెత్తుచు నేను జీవించుకొఱకు
పాత్ర కొక జేన! నా కుక్షిపడక కేది
జేన; దీనజనావనా? యానతిమ్ము.

నాకు నీకుఁ గల్గు నయమిత్రబాంధవ్య
మెపుడు కల్గెఁ గాని యింతదాఁక
ననఘ! నా కుటీరమునకు రా వదియేమి?
మొగము ద్రిప్పుకొనుట తగునె? తండ్రి!

సొమ్ము లేనికతనఁ జుట్టాలు మిత్రులు
తల్లి దండ్రు లింత దరికి రారు
నీవుకూడ సొమ్ము నే చూచి వత్తువా?
అయిన నాదుజన్మ మసలు సున్న!

సరసతను మాటలాడి టక్కరితనానఁ
బరుల వంచించి వెలుపల నురుల నొడ్డి
మిడిసిపడునట్టి జనులసమీపమందు
కాపురము సేయ నా కొంపఁ గట్టలేను.

ప్రకృతిలో సమస్తవైభవాల నిమిడ్చి
నాదు భాగ మింత నాకు నీక
లేమిలోన నేల? కామమ్ము పుట్టించి
చావుదెబ్బ గొట్టినావు తండ్రి!

## శ్రీకృష్ణదేవరాయలు

పృథుల మకరందము వెలార్చు కృతిప్రబంధ
వనధిలోపల హర్షాన మునుక వేసి
దేవురించెడు కవులకుఁ దెరువుసూపు
కృష్ణరాయగ్రణీ ! నమస్కృతులఁ గొనుమ !

విజయంబుం గొని దివ్య విక్రమకళా వీరాధివీరుండవై
ధ్వజమున్నిల్పితి బొట్టునూరను ప్రభావంబెన్న దర్బారు ది
గ్గజముల్ 'జే'యన వందిమాగధులు నీగంభీర శక్త్యున్నతిన్
భజియింపన్ భళిరా! నమస్సులివెభూపా! కృష్ణరాయాగ్రణీ!

తెనుగుం గబ్బపు ముద్దుముచ్చటలు సందీపింపఁగా వ్రాయు పె
ద్దనగారిన్ బహుగానుతించి భవదుద్దామంపు పేరోలగం
బున నాస్థాన కవీంద్రుఁ జేసి కనకంపుం బుగ్గలం దేల్చి ఫ
ల్గునగా జేసితి కొమ్ము టేన్గుపయిఁ దెల్గుల్ మెచ్చ రాజోత్తమా!

పటువైశద్య విశాల భావకవితావ్యాసక్తు లున్నార లు
త్కట పాండిత్య వియత్తలాపగ మహా గంభీరవీచీ సము
త్కట డోలాఖేల నూగువారలును నీ దర్బారునందుండి శే
మిటికో? పెద్దన కట్టిగగ్గెరను మేల్మిన్ వేసితో భూపతీ!

పసిడిగగ్గెర చిఱుగజ్జెల సమితి కేటు
లల్లనల్లన ఝల్లను చనుచు నాడు
నిండు కొలువున వ్యాపించె దండి శబ్ద
మిపుడు మా చెవుల్ గింగురు లెత్తుచుండు.

మొలక లెత్తినది ప్రఫుల్ల వాసన లీన
వేవేలఁ డెల్గు భాషావనమ్ము
నిండిపోయినది మానికపు రాసులతోడఁ
దోరాన హంపీ బజారులన్ని
ముదమందినది డెందము మహావిలాస క్రి
యారీతి పెద్దన యమరకవిత
రహియించినది హంపి గృహగృహంబుల నాంధ్ర
కమనీయ సాహితీ కాంతిచయము

ఈవు చెక్కించి పోయిన యింపితంపు
విలసనంబైన శిల్పంపు కలుకఁదనము
దిద్ది తీర్చిన హంఫీ ప్రదేశమందు
నెలమిఁ గన్పట్టు నేఁటికి కృష్ణరాయ !

ఎటఁ గాంచిన కవిపండిత
నటకులు గాయకులు శిల్పనయకోవిదు లు
ద్భట వర్గంబులు నీదు ప్ర
కటగుణముఁ జాటువారె? క్ష్మానాథమణీ!

కవనమల్లిన ప్రతివాని గడియ యేమొ
కాని నిత్య సన్మానంబు నాణెము లిడి
చేసినావంట వారికి క్షితితలేంద్ర !
తెనుఁగు శారద కవి మంచిదినము లేమొ ?

మనుచరిత్ర కవితాఘన దివ్యగంగా ఝ
రీలహరిని మున్గి తేలినావు
పారిజాతగ్రంథ పరిమళోద్యానంపు
సీమలో విహరించి చెలగినావు

ఆముక్తమాల్యద యను దొడ్డ కబ్బంబుఁ
గల్పించి వ్రాసి పేర్గాంచినావు
ఘనమైన కృతులను మనసారగా బెండ్లిఁ
జేసికొని సుఖంబుఁ జెందినావు

కవుల వీపులు బరువెక్కఁగా నొనర్చి
కానుకల నిడి సంతృప్తిఁగా నొనర్చి
తెలుఁగు కవితకు నొక వన్నెఁ దెచ్చినావు
మేలు భళిభళీ! కృష్ణభూపాలచంద్ర!

ఓ నరనాథ! యెంతటి మహోజ్జ్వల సత్కవిచంద్రుఁడైన, వ
ర్ణాన కలంగి క్రుంగునను న్యాయము నేఁడును గాక నీదు సం
స్థానమునందుకూడ గలదా! యిఁక నీకళ కేది దారి లో
కాన కులమ్ము లేని కవిగండఁడు శారద కెట్లు నచ్చెనో?

కొలువు కూటమున భాసిలి కళ వెలయింపఁ
బెద్దన్న గొంతును విప్పునపుడు
కీవిపై సింహపీఠికపయిఁ గూర్చుండ
హెగ్గడీల్ నిను సన్నుతించునపుడు

రమణంపు నీ దివాణమున నో కే తీరుఁ
కృతికన్యకల లాస్య మేలునపుడు
అమల గుండెలఁ జీల్చి సరి రాకఁ గని జయ
భూరిదుందుభులు మార్మ్రోగునపుడు

కోఱమీసాల పొంకంబు గొప్పఁదనపు
దొడ్డ బింకంబు నో తెల్గుదొర తరంబె?
కనుచు వర్ణింప వనజగర్భునకునైన
మేటి కవిరాజుకైన భూమీతలాన.

కాలికి గండపెండరముఁ గట్టిన నీ సముఖాన నేను భూ
పాలక యున్న గగ్గెరను పాదమునం దొడగంగ నాసరా
జాలదు కాని నాకు నెదఁ జక్కని కైత వసంతకాల వృ
క్షాల వసించు కోయిలల గానముఁ దీయగ నాస గల్గెడిన్.

## కవిపరమేశ్వరుఁడు

మీసముఁ ద్రిప్పి యీ తెనుఁగు మేదిని దివ్యకళాప్రపూర్ణ వి
ద్యాసము దీర్ణపండితకదంబము గుండెలడంగ గెల్చి ఘం
కా సరిఁగొట్ట నీవిజయకాహళరావము మ్రోతమ్రోగె నో
హో! సములేరి నీకు కవితోజ్జ్వలవిగ్రహా! వేంకటేశ్వరా!

నానాంధ్రావనిమండలేశ్వరుల సన్మానంబులంగొంచు వి
ద్యానైపుణ్య బుధోత్తముల్ గలుగు నాస్థానాలలో నీదు ప్ర
జ్ఞానైపుణ్య శతావధాన కవితాజ్ఞానప్రసూనమ్ములన్
జా నొప్పన్ విరజిమ్మినావు కవిపంచాస్యా! నమస్కారముల్

నిను డీకోగయతించువా డొకఁడు లేనేలేడు నీయాంధ్రభూ
మిని నేఁడీయుగమందు నన్నయలు వాల్మీకుల్ సరేయున్న నీ
ఘనవైదుష్యకవిత్వపాండితికి కంగారొందరే? వారు తే
రని నా వాదము గాదు వేంకటకవీశా! సత్కవీంద్రప్రభూ!

అలఘుప్రస్ఫుట కీర్తిడోలికల నాహా! తిర్పతి శ్రీకవీం
ద్రులతో నూగిననాళ్లు నెంతనెద సంతోషించితో నీవు నే
డిలపై తిర్పతి యెట్టి పుష్పమగునో యే స్వర్గమందుండి తె
ల్గుల సన్మానముఁగాంచి మెచ్చుకొనినిన్నుంజూచిమోదించునో?

కవులకుఁ గవిభూధవులకుఁ
గవిసమ్రాట్టులకుఁ గుకవిగజహర్యక్షా!
కవిపరమేశ్వర నీవె గు
రువగుదువు నిజముసుమీ! నిరూపణ సేయన్.

శబ్దశాసనుఁడు రాజనరేంద్రు నాస్థాన
గురువయ్యె రాజమందిరములోన
మనుమసిద్ధి విశేషమర్యాద లందె క
విబ్రహ్మ నెల్లూరి వీటిలోన
కృష్ణభూజాని మేలిమి పూజలందెను
పెద్దన్న విజయహంపీపురాన
రఘునాథరాయ గౌరవకీర్తి నందె వేం
కటకవి తంజనగరమునందు

పౌరలోక రాజుచే నొక్క పత్తనమున
నయ సగౌరవమునుఁ గాంచినారు నీవౌ
యావదాంధ్రావనీ పూజలంది నేఁడు
పాదమిడినాఁడవీ బెజవాడలోన.

## కర్ణుఁడు

గంటను కోటగుమ్మమునఁ గట్టి సుయోధనుకంటె మేలిమ
న్నంటనటంచుఁ బేదల ధ్వనిన్విని ప్రేమరసానఁ బొంగు నీ
వంటి మహానుభావునకు భారత యుద్ధమునందుఁ గెల్పు రా
కుంటమి కర్ణ! నాహృదయ మూరక నీరయి పాఱితీరెసిన్.

అవురా! నీ యసమాన దానబల విద్యాసంపదం గాంచి ని
న్నవరోధింపగ మాఱువేసమున నాకాధీశుఁడే వచ్చి నీ
దు విశేషంబగు కర్ణవేష్టణములన్ దోరాన నిమ్మన్ననో
రవిజా! తక్షణమీయ నీ విపులధర్మంబున్ ప్రదర్శించెడిన్.

నీ గురి కౌరవేశ్వరుల నే గెలిపించుట నాజి, శౌరి ప
న్నాగము పాండవేయులె రణంబున గెల్వనె దెట్టులైన శ
స్త్రాగమవేది! నీ బహు మహాబలవిత్తము కయ్యమందు వే
ఱేగతి శాపముల్ కతననింతకుఁ గల్గెను భానునందనా!

అనుకంపారహితాత్ములౌచు కుటిల వ్యాపార పారీణులై
యనిలో నీ యరదంబుఁ గ్రుంగ నినునన్యాయంబుగాఁ జంపె వె
న్నుని మోసాల నెఱుంగలేక విజయుండున్ భండనక్షోణిలో
నినజా! లేనియెడన్ జయంబచట నీదే సుమ్ము ముమ్మాటికిన్

ప్రజలిఁక నెత్తి రుద్దు నపవాదుకు లొంగి సభాముఖాననం
బుజహితపుత్ర! నీ జనని ముద్దులగారెడు నిన్నుఁజూచి పి
ల్వజనదు లేనిచో గురువులా; నిను నాటటి గేలిసేయుటల్
విజయుడ నిన్ను గెల్చుట భళీ! యిది కర్మనిబద్ధ జాతకాల్

జవముందీటిన యస్త్రశస్త్రములు నాశాలక్ష్మి మోహింప నా
డవురా! గుప్పితివీవు నాప్రబల జన్యక్షోణి భీతిల్ల కే
శవపార్థుల్; నడినెత్తిపై వెలయు నాశాపమ్ములే లేనిచో
రవిజా! నిన్ను ద్రిమూర్తులే గెలువజాలన్నేర్తురే? యుద్ధమున్

ఆహవ భూమిలోపల మహాత్ములు పేంద్రుల యంతవారె యు
త్సాహముతో శరమ్ములను దాలిచి పాండవపక్షపాతులై
దోహదమీయఁ గర్ణ! రణధూర్తుల గర్వముఁ జెండనిల్చినా
వోహో! సెబాసు నీదగు సముజ్జ్వల పౌరుషరాశికి న్నతుల్.

నినుఁ బట్టపురాజుగఁ జే
సిన దుర్యోధనుని యాస చెల్లకపూర్వ
మ్మున మరణ మయితి విడె నీ
యనవద్య ప్రకట చరిత కంజలి కర్ణా!

## భీష్ముడు

పదియు నెనిమిది రోజుల ఖండనమున
ధర్మజుఁడు శౌరివిజయులే తల్లడిల్ల
వెకిలి జీవుండు నగు నపుంసకుని ముందు
వృద్ధవీరుండ శరము సంధింప వేల ?

మోసముచేత నిన్ గెలిచి పోయిన పాండవసూను లెల్ల రే
వీసపు భాగమైన పృథివీ వలయానఁ గ్రహించినారె ? భీ
ష్మా ! సమరాన నిం గెలువజాలు మగండిల పుట్టునే ? శరా
భ్యాసము రిత్తవోవునె ? జోహరు భవద్ఘన బాణవిద్యకున్.

గురుఁడా భార్గవరాముఁడే యునిని నీకుం జంకి యల్లాడె నీ
శర సంధానవధాన బంధుర కళాసామర్థ్యముం గాంచి య
బ్బురమందెన్ జగనొబ్బగండ సమరంబున్ నీదె పై చేయి యె
వ్వరు కాదందురు తథ్య మీ విషయముల్ వ్రాతల్ నదీనందనా!

ద్రోణుని గేహాన వెన్నముద్దలు మెక్కి
నల్లనివాని పన్నాగ సత్తి
గురువుగారి యమోఘ తరమైన సాధన
వరమైన గోష్ఠలి పచ్చిబలము
వాడవాడలయందు బలము సాధించి కు
స్తీల నెగ్గిన భీముఁ జేతికఱ్ఱ
అల ధనంజయుని చేతుల సొమ్ము బలగమ్ము
కదనానఁ బొగరెక్కు గాండివమ్ము

నిన్ను నెదిరించు నేఁ బోరనిలిచి దుశ్శ
కున మగు శిఖండి సమరానఁ గనుటఁ గాని
ఘన కురుక్షేత్ర యుద్ధరంగాన నీవె
యదనుఁ జూచియు శరము దించుదువె భీష్మ!

సమరంబున్ బ్రతివాది శత్రులకు నాశాజ్యోతి చల్లార గు
ట్టములన్ దేరుల నేన్గువాహినుల నేలంగూల్పగా నాఁడు నీ
యమలంబైన పవిత్ర వర్తనకు సాక్ష్యంబిద్ది వాక్రువ్వ నో
సముదగ్ర ప్రతిభావిశేష! గురుభీష్మా! దివ్యగంగాసుతా!

## కిరీటి విషాదము

నాకీ యాలము వద్దు సోదరులతోనా ? నేను పోట్లాట, కృ
ష్ణా కారుణ్యపయోనిధీ! వలదు రాజ్యంబేలు వ్యామోహముల్
నా కల్యాణముఁ గోరు పెద్దలు గురుల్ నా బంధువర్గంబులన్
ఢీకొన్నన్ ఫలమేమి జాఱెడిని గాండీవమ్ము నా హస్తమున్.

కన్నాకున్నరుఁ జేయగాఁ దలచి సత్కారుణ్యపుంగుండె ను
త్పన్నంబైన రసార్ద్రమంజుల సుధాభావాననం దేల్చి నేఁ
డిన్నాళ్ దాక నఖాండదృక్కులను నెంతేఁ జూచు నాయొజ్జద్రో
ణున్నే నెట్టు వధింతు ఖండనమునందున్ నేఁడు దామోదరా!

జగతిన్ మల్లడిఁ జేయగాఁ గల తపశ్శక్తిస్వరూపుండు నా
పగసూనుండు మహాపరాక్రమ యశోభాస్వంతుఁడౌ భీష్ముఁడౌ
నుగదా! యాతడు తాత వెండియునుకర్ణుండన్న సామాన్యమా
తగవా? యుద్ధము నాక దేల?యనుగుందమ్ముంద్రతో మాధవా!

రణభూమిన్ బ్రతిపక్షనాయకుల బుఱ్ఱల్ జీల్చి చెండాడి చి
క్కిన సామ్రాజ్య వధూమణింగరమునం గీలించి భోగాల దే
లినకంటెన్ పులిభిస్సటన్ మెసవి సంతృప్తిన్ బ్రహర్షించి జీ
వనమున్ సేయుట మేలువైరమిఁక బావా ! వద్దుమమ్మాటికిన్

బలముంజూచి తెగించి భండనము దేవా ! సేయుచో నాదు బం
ధులసంఖ్యాకమనంతముల్ జయముఁ గొందున్ జాలుజాలింక నం
దులకీ యాసలు లేని స్వర్గగృహసందోహంబు సృష్టించుటల్
కలధౌతాంబరధారి! నా చిలిపివ్యాఖ్యానమ్ము మన్నింపవే!

కఱకున్ ముష్కరబుద్ధిచేతి నల లక్షా గేహమున్ మమ్ము సో
దరులా కౌరవులెల్లఁ గాల్చనట యత్నంబున్ బొనర్పంగ నీ
కరుణాసాంద్రవిలోకన ప్రభలతోఁ గాపాడినావన్న నీ
ధరణిన్ దేవర ! నీదువాక్కులు శిరోధార్యంబు మాకెప్పుడున్

వలదోయీ? చినమెత్తుమా బ్రతుకుకై బ్రహ్మాండమా? లేవెకొం
పలు జీవింప నితాంతహర్షమున నోస్వామీ! యథార్థంబుగాఁ
దెలుపన్నెత్తుటి కూటిభోజనపు విద్దెల్ నాకు వద్దింక చే
తులు రాకున్నవి నన్ క్షమింపు గుణసింధూ! దీనబంధూ నమో!

అయినన్ సంగరభూమిఁ గాల్నిలిపి శస్త్రాస్త్రమ్ములం గుప్పియీ
జయ మార్జింపఁ దలంపు నాకసలు ప్రస్తావింపగా లేదు, నీ
దయయున్నన్ బదివేలు నాకది మహాత్మా ! యిట్టికంగారు నా
కయమో ! రుద్దకు దుగ్ధసాగర విహారా ! భక్తకల్పద్రుమా !

పగవారా ! యలకౌరవేశ్వరులతో పాటల్ల భీష్ముండు నా
దు గురుగ్రామణి! ద్రోణుఁడున్ సకలబంధువ్రాతముల్ కృష్ణనా
దగుదో శ్లాఘ్యము నీరసించెడిని మిథ్యాప్రాజ్యసామ్రాజ్య మే
లఁగ నాడెందము పొంగిపోవదు విలోలంబయ్యె వాక్రువ్వఁగన్

## కృపాభిక్ష

నన్నుంగంటివి నన్ను మంచితివమందానందముఁ బొంద నేఁ
డిన్నాళ్ దాక నఖండభావలయమందీ వెంతో దీవింప నీ
కన్నుల్ ముందర నాట్యమాడగను నీకా! డెంద మందిప్పు డు
త్పన్నంబయ్యె విరుద్ధభావములు మాతా! దృష్టి సైరించుకో.

మరపుందట్టుచు నన్నుఁగూడఁ దనియింపన్ నీదు గర్భాన ని
ర్భరమోదాన ననుంగునందనునిగా బంగారుపూబంటుగా
సరవిన్ గంటివి నాయనుంగుజననీ! సౌమ్యంబు సిద్ధించెనే?
మరుగై పోయెనె?యీకులాలగోడవమ్మా!న్యాయమిప్పించుమీ

అవనీచక్రము సంతసంపడగ విద్యామూర్తి రాటాలరా
జు వివేకంబున శాంత్యహింసలను విచ్చుంగత్తులంబట్టి నా
డవరోధించె బ్రిటీషుపాలకుల రాజ్యార్థంబు నీసూను లీ
యవకాశంబును నిల్పఁజాలగల సాహాయ్యంబు నిప్పించుమీ.

ఝిల్లీ రోదసివీథిపై నగసి యాడెంబో దిశా గోళపున్
గల్లోలంబును మాన్పఁజల్లదనపుంగలాణ్య రేఖారుచుల్
జల్లెన్ నీ పసుపుంబతాకము ప్రశస్తంబైన నీకీర్తి సం
ధిల్లెన్ మాకు దరిద్రమూర్తులకు నేడీ! సౌఖ్యమిప్పించుమీ!

బ్రతుకుల్ దుర్భరమైన యీజగతిలో వైషమ్య భావంబులే
మెతుకుల్ రూపము మారిపోయెనుగదే! మేలెంచువా డేడి? మా
గతి నీక్షింపఁగలట్టివా డొకఁడు వక్కాణింపఁ గన్పట్టునే?
రతనాల్ వజ్రములున్న దానవుకృతార్థత్వంబుఁబొందింపుమీ

మిసిమి వెలార్చు నా పసిడి మేడల నీడలలోన నాకటన్
విసిగివిసింగి దేహముల వీడిన పేదల మస్తకంబులన్
మసలు కళాధిదేవి యమమార్గముఁబట్టి నశించిపోవ నిం
పెసగునె? దేశభాగ్యములు విద్దెకు తావల మింత లేనిచో.

బ్రతుకఁ జాలించినట్టి యే ప్రభునకో? తొలి
జ్ఞప్తికై శిలావిగ్రహాల్ నాఁడు గట్టి;
కొలిచి నారలు నేడింత తలచినంత
వెలయు నిముసాన మా శిలావిగ్రహములు.

సందేహింపకు మాత్మలోన ఘన సత్సాంగత్యమే లేని యీ
వందల్ వేలుకులాలమధ్యమున కొంపంగట్టి నే నుండనో
హిందూమాత భరింపలేని పనిసుమ్మీ ! శాసనాల్ వల్ల నీ
నిందారూపకమైన భేదములు సంధింపంగ వీలైనదే

బూజుపట్టిన మహామూఢసిద్ధాంతాల
ముదలకించెను రామమోహనుండు
జన్మ సత్త్వమె ప్రజాస్వాతంత్ర్య మనుచు ఢం
కాc గొట్టె బాలగంగాధరుండు
సత్యమే శాశ్వత జయపతాక నిరంత
ర క్షేమమనె స్వామి రామతీర్థ
భారతజాతి సంపైదగ్ధ్యమును నిల్ప
విధి మనదనెను గోవింద రనెడి

పుత్రుల మెడందలోc బొంగిపోవునట్టి
భరత పౌరుషవ్యోమ శుంభ ద్ఝరాంబు
రాశి ప్రవహించె భువనాలు ప్రణతి సేయ
నిపుడుcగూడ నటులె ప్రవహింపనిమ్ము.

పౌరుషమూర్తులై భయద భండనభూమిని చండభానులై
వైరిశిరాలఁ ద్రెంచిన యపార రణోత్సుక శాలురమ్మ నీ
కూరిమినందనుల్ కుడువఁ గూడును లేక యెదిర్చి రమ్మ దో
స్సారముఁ జూపి నాఁటి బల సంపదలిమ్మనుగుం గుమాళ్ళకన్

అల కంచి కామమ్మ జ్వలిత నేత్రాగ్నిలో
కఱగిపోయిన వీర భరతజాతి
గజనిమామూదు నిష్కరుణంపు దోసిల్ల
మ్రగ్గిపోయిన వజ్రమణుల రాశి
బ్రిటిషు రాజన్యుల పెత్తనమ్ముల క్రిందఁ
గతి దొఱంగిన మంచి బ్రతుకుఁదెరువు
నట్టింటిలోన నన్నాదమ్ముల విరుద్ధ
ప్రకృతిలో జాఱిన బాంధవమ్ము

తావకీన సౌభాగ్యాల చేవఁ దరుగ
మొదట నివి మూలకారణ భూతమయ్యె
వాసిగన్నట్టి నా జాతి వరచరిత్ర
పసిడి వ్రాతలమూలాన ప్రబలు టెపుడొ ?

## నెహ్రూ

ఎన్ని యగ్గికొండ లెన్ని మహోవార్ధు
లెన్ని నెత్త్రుబొట్టు లింకిపోయె
నీదు గర్భకుహారి నెహ్రూ! జగద్బంధు!
తల్లిదేశ దీర్ఘదాస్యమునకు.

సరవిన్ నాల్గగు ఖండవాసులకు భాస్వంతుడవై దివ్య సో
దరభావప్రసవాలుపూయ దశదిగ్దంతుల్ జయధ్వానముల్
సరసానందము మీరసల్పను జయస్తంభంబు నాటన్ బ్రజా
పరిషత్తున్ నెలకొల్ప నీమహిత ధీప్రజ్ఞాబలం బెంచెదన్.

భువనంబుల్ గబళింపఁ జాలగల దివ్యుల్; దివ్యతేజస్సము
ద్భవచారిత్రులు హూణరాట్ప్రముఖ సంతానంబు గారాడ, శాం
తివిధానమ్మును మెచ్చు మాని యగు గాంధీతాతతో నాంగ్లభూ
ధవులే మెచ్చ శ్రమించితో యిచటి స్వాతంత్ర్యమ్ముకై నెహ్రూజీ!

కులముల్ పెక్కుగలట్టి దేశమునకున్ క్షోణిన్ స్వతంత్రంబురా
గలదంచున్ మతినెంచి నీ సకల విజ్ఞానమ్ము వెచ్చించి సొ
మ్ములరాసుల్ భవదీయ మాతృకపదంబుం జేర్చి మోదాన జై
లుల క్షోభిల్లిన నీకు సాటెవఁడు నెహ్రూ!మంత్రివాస్తోష్పతీ !

చిలుముంబట్టిన భారతావని జయశ్రీవైభవంబెల్ల శో
భిల శాసించిన నీదు శాసనము లుర్వీ మూఁగ్ధముల్ ధన్యముఃల్
భళిరే ! నీయటువంటి ప్రజ్ఞగల భాస్వన్మూర్తి నింగాంచి మా
తలి! యుప్పొంగఁ బ్రహర్ష కార్యమదిగాదా!మాకు విద్యానిధీ!

పొగరుబోతునిజాము భూరిసామ్రాజ్యంబు
గెలిచి జెండా యట నిలుపునాఁడు
స్వాతంత్ర్యభండనశ్మశ్రు నిల్చి గెల్చి స
మ్రాట్టులే వొగడ జైకొట్టునాఁడు
తల్లి భారతమాత యుల్లంబు ముదమంద
శాంతిసత్వము దూరపరచునాఁడు
అఖిలాసియా సమైక్యముఁ గోరి కదుఁ బ్రజా
పరిషత్తు నెలకొల్పి వరలునాఁడు

మూఁడుపదులమీఁద మూఁడు కోటుల తమ్ము
లలతి యలతి స్వేచ్ఛ ననుభవించి
యాత్మఁ బొంగునప్పు డాదర్శమూర్తి ! నీ
ప్రజ్ఞ కిడరె వేయి వందనములు.

అమరజ్యోతి శుభాశిషమ్ములను దివ్యానంద సందేశ రా
జములన్ మున్పటిరీతిఁ గొందువొకో ? మాసల్లేవొకో? తెల్ప నె
ప్రహు ! మహాత్మా! కులవర్గదేశమున నీ రోజున్విచారింప ధ
ర్మము దూరంబయెకర్మ వెంటబడిస్వార్థాపేక్ష హెచ్చయ్యెడిన్

అనుగుందమ్ము లరుంధతీసుతులకన్నా నేఁటి స్వాతంత్ర్య సౌ
ధ నివాసంబసలే హుళక్కి యనుచాత్మన్నేఁడు దుఃఖంబుతో
డను నిట్టూర్పు నిగిడ్చినారిపుడఖండంబైన ప్రేమాన వా
రినిఁ బ్రేమించి నివాసయోగ్యతలుఁ గల్పింపంగ నర్థించెన్.

# తెలుగుతల్లి

తొలినాటి తెలుఁగు బూవులదోపులోన, న
న్నయ్య తేనెనుఁ ద్రావి యలరునాఁడు
మెఱపులచ్ఛమ్మ బమ్మెరవారి గుమ్మాన
కంజజు సతిఁ బట్టి గుంజునాఁడు
ఆర్ద్రహృదయుఁడు బ్రహ్మన్న కంఠమునెత్తి
కులము లేదని నొక్కి పలుకునాఁడు
తగు చిత్తశుద్ధి మాధవవర్మ రారాజు
సభలోన న్యాయంబు జరుపునాఁడు

తెనుగు లెల్ల రనుఁగు ననుజుల చాడ్పున
మెలగునాఁడు కీర్తిఁ జెలఁగునాఁడు
ఘనతఁగాంచినావు గద ! కీర్తి నీనాఁడు
నిలుపుకొనుము మరల తెలుగుతల్లి.

స్థిరసత్కీర్తిం ఘటించి సంపదల నెంతే దాగి లోకాలలోన్
బరువుం జేసుకొంచు ధర్మమునుజ్ఞానంబుం బ్రచారంబు సం
బరమున్ సల్పి మహామహావస్థలుల శుంభద్దైర్యముం జూపి ని
ల్చిరి నానందనులంచుఁ బొంగితివి తల్లీ! నేను వీక్షింపుమీ!

చెల్లెంబూర్వపు పోకడల్ కవుల సచ్ఛ్రీ భోగభాగ్యాలు రం
జిల్లన్ రావులు లేవు నీసుకవితో స్నేహంబు పెంపొంద నా
సల్లే వింతకు సత్కవీంద్రతతి కాశాజ్యోతి చల్లారె, నా
తల్లీ! యెట్టులఁ దమ్ముఁ గుఱ్ఱలకు సంధానంబుఁ గల్పింతువో?

పలుకం దొల్లిటఁ బొర్గువాసులకు సావాసంబుఁ జూపించి వా
రల దుఃఖంబునుఁ బంచుకొంచు సరియర్థంబొప్ప భాగాన శ్రా
తలి సొమ్మిచ్చి చరించుదానవు, మహాంధ్రస్వర్ణకళ్యాణి! జో
తల నర్పించెద దిద్దుకొమ్మనుగుఁ బుత్రిశ్రేణి వైరున్యమున్.

మూడుంగోటుల నందనుల్ కలుగు నీ పుణ్యంబపూర్వంబుగా
నీ డేరా లలగాలిలో నెగురు బాణిన్ బొందులుం బొత్తులున్
నేఁ డావంతయు లేక క్రోధ విషవహ్నిన్ గ్రక్కుచున్నార లా
యీ, డాబుల్ సవరించి పుత్రులకు తల్లీ! పొందు నేర్పించు మీ

# కృతజ్ఞత

అలికాక్షుఁ గుస్తీల యనిలోన నెదిరించి
పార్థుండు గెలిచిన ప్రధనభూమి
బలికి, బలిగ తనూభవుని నర్పించిన
మాధవనృపమౌళి మహితసీమ
స్వైరవిహారమ్ము పంచాననముమీద
కనకదుర్గమ తిరిగిన తలమ్ము
అపరవిద్యామూర్తి యౌ చెళ్ళపిళ్ళ వేంక
టేశుండు తన పాద మిడిన తావు

పేరు మ్రోసిన తెల్గుల వీరకవుల
కెడమ పాదాల గగ్గెరల్ దొడుగునట్టి
ఆంధ్రరాజ్యేందిరకు ముద్దుటనుగుపట్టి
విపులకళలకు నిలయమ్ము విజయవాడ.

మధురపిక కూజితములకు మనమునందుఁ
బొంగిపోయెడు దిగ్దంతులుం గలట్టి
యీ సరస్వతీపూజా ప్రభాసమాన
మందిరమ్మున నా పాట యందమెకద!

ఎలమిన్ శ్రీ బెజవాడలో కెరలు నీ కృష్ణానదీ సైకత
స్థలులం గ్రుమ్మరిమంజులార్భటులపై దగ్ధ్యంబుఁ గ్రుమ్మించు,కో
యిల,యస్మత్ కవితాకుమారి యిది యెంతే నిక్కువంబైన నా
కలముం దిద్దిన బాపుజీ మధుర కాంక్షల్ దీరెనం చెంచెదన్.

పంచమశబ్దంపు ప్రళయాగ్నికీలలో
దగ్ధమైపోయె నా ధన్యతనువు
యుగయుగంబులనుండి పగవాని హస్తాన
నలిగి జీర్ణించె నా కలిమి బలిమి
కొఱగాని శాసనోత్కర బంధనపు చాయ
చాటున మణగె నా చదువు సంధ్య
ఆలంబ మిసుమంతయైన లేనికతాన
యుడిగి చల్లారె నా యూహశక్తి

చితికిపోయిన బానిస జీవనమున
చెదరి యింకిపోయినది నా చీము నెత్రు
స్వాంతమున భేదమెఱుగని వాడె నన్ను
నింపు మీఱగ ధర నుద్ధరింపగలఁడు.

చవులూరించెడు సత్కవిత్వ రచనా సామర్థ్య వైశద్యమున్
జవిఁ జూపించిన దిగ్గజాలుఁ గల యీ సాహిత్య పీఠాన మా
కవిసమ్రాట్ చరణంబు నిల్పిన సభాగారాన వీర్యాన, నా
కవితాకన్య పొనర్చు నృత్య కటక క్వాణమ్ము రాణించెడిన్.

ఏనాఁడో యల కృష్ణభూమిపతి సాహిత్యస్ఫురద్డోల వి
న్నాణంబుం గళ మెత్తి పాడె కవితానాథుండు పెద్దన్న ది
వ్యానందాబ్ధి తరంగ డోలికలలో నాటాడ నేఁడీ కవి
శాన గ్రామణులొందఁ దావుఁగలదే? సాహిత్య రత్నాబ్ధిలో.

భాషాగభీర శుంభద్రత్న నిలయాన
భావ రత్నము లేర్చు వండితుండు
పేరొందినట్టి కవిబ్రహ్మలకు వాక్కు
నేర్పించు సుకవితా నిపుణబుద్ధి

సంస్కృతాంధ్రాంగ్ల భాషాదేవతలఁ గొప్పఁ
బూలను ముడిచిన మోహనుండు
తెలుఁగుయోద్ధల మహోజ్జ్వల శౌర్యకార్యాల
నెత్తి తా వ్రాసిన యిద్ధసుకవి

ప్రథిత విశ్వనాథ వంశ సాగరసుధా
కరుఁడు సుజనవరుఁడు, క్రమ యశుఁడు
సభ నలంకరించె సత్యనారాయణ
యెదురులేని కయితఁ జనువుకొండు.

వాడి బాకును జడిపించి పగరగుండెఁ
జీల్చి చెండాడి పులియని సెప్పుకొన్న
పాపరాయుండు పుట్టిన ప్రథితసీమ
బొబ్బిలి పురమ్ము నాజన్మ పుణ్యభూమి.

చివికిపోవు నిరాలంబ జీవనమును
గడుపుచున్నట్టి నా కావ్యకన్యఁ గాంచి
శరణమిడిన మాయయ్య దేవరపు దొరను
సత్కృతిక తాన జగతినిఁ జాటుకొందు.

ఏనాఁడు నాజాతి జ్ఞానప్రసూనాలు
కాయులై ఫలసిద్ధి గాంచఁగలవో ?
ఏనాఁడు నాజాతి పృథులభోగము ధరా
భాగాన లభియించి వరలగలదో ?
ఏనాఁడు నాజాతి మానుషత్వ మొకింత
యున్నతస్థానమ్ము నూనిమనునో ?
ఏ నాఁడు నా జాతి నాణెంపు రాణింపు
వెలుగొందఁ దళతళత్తళల మనునో ?

కాలరథచక్ర భీషణ గమనమందు
మంచిరోజుల నేనాఁడు వించుమనునో ?
పలుకరించిన సడిసన్న తెలుఁగుకవిత
నాఁడుఁ దోరాన నాదు ఘంటము లిఖించు.

ఓ జయవాడపత్ర[illegible] మహోజ్జ్వల సద్గుణశాలులార ! యు
త్తేజపరాక్రమోన్నత సుధీకలశాంబుధి చంద్రులార ! అ
వాక్యజృపావిలోకన సుధామయ దివ్యకళా ప్రపూర్ణులా
రా! జయమాత మీకివె మదంజలి మంజులతాప్రసూనముల్

# కలవరింత

కలికీ! యెవ్వఁడు నెత్తిఁ గట్టె యిహలోక ప్రాజ్య భోగాన మే
డలు కట్టించు సురాల యాన, నట మేడల్ మిద్దెలుం గొంపలున్
గలవే? లేవు; నిజంబు ప్రాణులట యే గాలిందుమారాన నే
నలుసై పోదురొ బుద్ధికందనిది చానా! దైవమర్మక్రియల్.

కాల మతిక్రమించెడి నిగారపు దేహము కాలవాహినిన్
దేలకమున్నె యీ యెడఁద దివ్వెలు నారకమున్నె యీ సుఖ
శ్రీ లవి బోకమున్నె కడు రేచిన ప్రేమసుధార్ఝరీతరం
గాలనుఁ దేలిపోవుదమె కమ్మని హాయి కవుంగిలింతలన్.

వలపుల రాణి నిక్కముగ బంగరుబొమ్మలవంటి కన్యకల్
గల సిరి కాలగర్భమున కన్నులు మూసిన తోడనే శవం
బులు మన దేహముల్ ముటికిబొమ్మలు కాలముపోకముందె నీ
చలువతనంపు చన్నుగవ సందున నన్నిదురింపనీయవే.

కోదమపు తేటులా యడవిఁగ్రొన్నన పెన్గుసుమాలలోన సొం
పొదవిన తేనియల్ మెసవ నూహలు సేయునుదంతకంబె నీ
పెదవులనుండి జాఱిన నవీనమరందము లారగింప నా
హృదయపుపాత్రలోన హృదయేశ్వరి! నింపుము ప్రేమరాగమున్

మఱువక చూడుమల్ల పె?సమాధులలో ననబోడు లెంత సుం
దరులయి నిద్రబోదురో గదా! యెటువంటి మహాత్ము లింకకే
ధరశయనించినారలో గదా! జనియింపదు నేటికొక్కఁడున్
మఱువకు సృష్టిమర్మమిది మానిని! చారువచోవిలాసినీ!

ధరణీరాజ్యమునన్ భుజాబలమునన్ దర్పాంధకారమ్మునన్
పరిపాలించి సమస్తభోగముల నాస్వాదించు రాజన్యు లే
గిరి, వారింగురియించి పాడదుగదా? కించిత్తు భూకాంత యూ
పిరియున్నప్డె సుఖింపమేలు తరుణీ! ప్రేమాంర ముద్దీయుమీ!

సమతాంగీకృత నిర్మలాంకితసుఖాసంశ్లేష గాఢానురా
గమునం దేలుటకుద్యమించు మనయాకాంక్షన్ వృథాటోపకో
పమునన్ భానుఁడుఁ గాంచలేక యరుణజ్వాలల్ వెలార్చెన్ని మే
షములో నెంతటి మార్పువచ్చునో? పరిష్వంగంబుగావింపుమీ

ప్రేమమోహంపుబంధాలఁ ద్రెంచలేక
వలపుముద్దుల కబ్బంబు వ్రాసినాఁడ
ప్రణయగీతాల మరుహజారమ్ములావు
ప్రియతమా ! స్వాగతమ్ము విన్పింతు రమ్ము.

## హితబోధ

మనలోనే కలహాలఁ బెంచికొని మోమాటంబు వోనాడి గుం
డెను గొండంబలెఁ జేసి శాత్రవులతో డీకొన్న రీతిన్ బలా
లను గోపాలనుఁ బెంచుకొన్న నిది ధర్మంబౌనె? తండ్రీ క్షమిం
చిన నేపాటిది నీకు నాకొఱకు నీచివ్వన్ విసర్జింపుమీ.

అల్లుని శత్రుఁగాఁ దలఁచి యాహవసీమనుఁ గాలుద్రువ్వి మ్లే
చ్ఛుల్లవలేశ మేని దయఁజూడనివారలఁ బొందు సల్పి నా
వల్లభు పంచప్రాణములఁ బట్టి తెగించెద వేల ? నా నుడుల్
కల్లటయా ? తనూజనికఁ గాదటయా ! జయచంద్ర నాయనా!

ఏ సుముహూర్త కాలమున నింపు సుగంధము జల్లునట్టి స్వే
చ్ఛాసుమరాజి బీల్చితొ ? భృశంబుగ నన్నుఁ గనంగ నట్టి దీ
ఊాసుమరాశి నే నయితిగాదొకొ? తండ్రి ! తిరస్కరించి నా
భ్రూసిత భాగపుం బసుపు బొట్టునపాకరణం బొనర్తువా ?

నందన నన్న నేనె? మరి నందనుఁ డన్నను నేనె యాదు భూ
వందిత! యీ కనోజి పరిపాలన నీతరువాత నాది గా
దందువు! నన్నుఁ బెంచిన మహత్తర పుణ్యపురంధ్రి తల్లి కే
మందువు తం(డివై యిటుల నర్థపుఁ జేతలఁ జేయఁ జెల్లునే?

అఖిలభారతమునకు దివ్యామృతంబుఁ
జేపి రక్షించు గోమాతఁ జిన్న మెత్తు
కరుణ నూపక వధియించు తురక జనుల
నాయనా! నిశ్చయమ్ముగ నమ్మరాదు.

హిందువులలోన హిందువు
లెందున సంబంధమింత యేనియు లేక
న్నందున మన భారతమున
చిందులఁ (దొక్కినవి శత్రుసేనా (వజముల్.

జయచంద్రు రతనాల సదనానఁ దనివార
విహరింప దింక నీ ప్రియతనూజ
ఘన కనోజిపురంపు కనక పీఠికమీాద
కాల్ పెట్ట దింక నీ కన్నకడుపు

పృథ్వీరాజు మనోజ్ఞ పృథులాంకభాగాన
నిదురబోదింక నీ నీకుమారి
ఢిల్లి రాజ్యశ్రీ యుడిన నతిసముదాయ
మందుకో దింక నీ యనుగుపట్టి

అల్లునకు మామకును యుద్ధ మావహిల్లి
విలయ కాలాగ్నులిక విజృంభించునేమొ ?
నాయనా! రాయబారమ్ము నడుపుకొమ్ము
పట్టుదల వీడు తురకల జట్టు వీడు.

# సు భా సు బా బు

రెండు శతాబ్దు లాబ్రిటిషుశ్వేతుల పాలనలోన మ్రగ్గి పెన్
గండములన్భరించిన యనంత చిరంత దిగంత దంతురో
ద్దండ యశః ప్రభూత గుణధార్మిక శాలిని భారతాంబ నీ
యుండనుఁ జూచి సంతసిలెరా! రణకోవిద! బోసునాయకా!

సింగమవై దగా బ్రిటిషు జిత్తులమారి సృగాలమున్ జగా
భంగ మొనర్పలేపిన సిపాయిలు బేరు నజాదు దండుగా
పొంగిన గుండెతో నిలిపిపోయిన నీయసమానశౌర్యరా
శిం గని యెంతయో పరవశించె నిజమ్ముగ భారతాంబయున్.

అదిగో! పండిన నిండు స్వేచ్ఛ యను సంధ్యాలక్ష్మి యీజాతిక
భ్యుదయానందమొసంగ కాంతులగకుప్పౌన్ జిమ్మె! నీయూహ నీ
హృదయావేదన వేడిబాష్పములు కోర్కెల్ పండుగామారె, నీ
యదనన్ డాగితి వేడ నీదయిన యా యావైనముం దెల్పవా?

చిలుతజపానువారిని వశీకరణం బొనరించి యా మహో
గ్ర రణములో విరోధుల శిరాలుఁ గరాళఁ గృపాణదేవికిన్
బోరిబోరి భోజనంబుగ ననూహ్యముగా నిడినట్టి విక్రమ
స్థిరుఁడవురా! నమశ్శతము దీవ్యదఖండ యశః ప్రభాకరా!

ధర నొక్కమ్మడి నేలుతెల్లదొరలన్ ధైర్యాన మార్గొంచుసం
గరమున్ భారతజాతి వాహినుల నేకగ్రీవులంజేసి హి
ట్లరు సన్మానము లందివచ్చిన సుధాలావణ్యమూర్తి! బరా
బరులోయీ? భవదీయనిర్మల యశఃపాదః చరిత్రానకున్.

ప్రళయభీకర మహో రణరంగ భూమిలో
సీమ భూపతి కన్ను చెదరు వేళ
అహిత భీకర మారణాయుధ సామగ్రి
విలుచుకుపడ మిన్ను విలుగు వేళ
గోసాయి గుజరాతు కోమటి మూర్తిలో
నలఘు దివ్యజ్యోతి వెలుగు వేళ
ప్రతినాయకుని నిబ్బరపు గుండియలయందు
స్వేచ్ఛాంకురమ్ములు పెరుగు వేళ

బక్క-చిక్కి-నట్టి భరత పుణ్యసవిత్రి
యుగయుగాల దాస్య నిగళయుగముఁ
ద్రెంప కదనభూమి జృంభించి శాత్రవ
ప్రతతి గెల్చినావురా! సుబాసు!

నలువది కోట్ల తమ్ముల వినాశపు పాపపు దాస్యబంధ శృం
ఖలముల వీడఁగొట్ట మొనగాడవునై యురమొడ్డి సీమ ధూ
ర్తుల పరిపాలనా కుటిల క్రూర పిశాచిక రాళ దంష్ట్రికల్
నలుగ రణంబులో నిలిచినావు, సెబాసు సుబాసు నాయకా!

ఢిల్లీ కన్నులుఁ దేరుకొన్న యవి నీకీవిం బ్రదర్శింప లాల్
ఖిల్లాపై పసుపున్ పతాకము సెలంగెన్ గర్వపుంబూలమై
జల్లెన్ హిందు ధరాలలామయు నుషస్సంధ్యారుచిం దేలె మా
పల్లీ పక్కణముల్, పురాతనపు సంపత్కీర్తి మాకబ్బుతన్.

మేటి యజాదుదండు లురిమెన్ గలహాభ్రభగృహాంగణంబులో
దీటైన కోరమీసలకుఁ దెంపరిలావయి, మాతృదేవతా
కోటి కిరీటరత్నరుచిఁ గూర్పగ సాయుధులైన తమ్ములే
కోటి గళాలతో నెదురుకోలును సల్పిరి నీకు ధార్మికా!

హిందూరాజ్య రమాధిదేవి తొలిపూయించెన్ సుధామంజులా
నందోత్తుంగ యశఃసుమంబు జగదానంద ప్రభూతంబుగా
బృందారణ్యము దీటు తగ్గ మరియేదీ! నేడు నాసూనపున్
గంధమ్మింత ఫలించుగావుత! భవద్గాఢాస్థ వాంఛావళుల్.

స్వాగతమిచ్చుకొన్నయవి పశ్చిమ భూములు నీ చరిత్రలో
భాగముఁ బంచికోగ మునిభానుఁడు మోహనదాసు గాంధి నీ
చాగముఁగాంచి విస్మయమెసంగ భళాయన దిక్కులెల్ల మా
ర్మ్రోగె మహావిజృంభణ నిగూఢపరాక్రమ వీరదుందుభుల్.

నియమబద్ధమైన నీ ప్రత్యణువునందు
పౌరుషంపు ధునులు పరువులెత్తు
పిరికికింత దారి చొరరాని నీయెద
పురుషబలము పొంగు లురకలెత్తు.

నవఖండములకు నానానూనధర్మ వి
ద్యాసూన సురభిళ వ్యాప్తచరిత
బుద్ధదేవుని మహా బోధివృక్షపు నీడ
నెళవుగాఁగొన్న పునీత మహిళ

రసపుత్ర విజయ సంగ్రామ రంగములోన
ధ్వజము నెత్తిన దివ్య విజయలక్ష్మి
దిగ్గంతాల సంధించి విజ్ఞానంపు
కంబాలు నిలిపిన కన్నతల్లి

సదమలాత్మ భరతజనని యెంతటి ధన్యు
రాలో, యెంత పూజ్యురాలో, యెంత
యప్రమేయురాలో యాత్మనందనునిగాఁ
బడసె నిన్నురా! సుబాసుబాబు!

జాబిల్లి న్నిరసించు నీదగు ముఖాబ్జం బెంతగా కందెనో
బాబూ! పాదము లెంత పొక్కెనో కో! దుర్వారోగ్రపుందారులన్
కాబూలెల్లు గమించి చొచ్చితివి నీగాథాప్రవర్తుల్ కటా!
సోబత్తింత యెఱుంగలేని యనుజుల్, చుట్టాలు గుర్తింతురా!

ఎగబ్రాకినవి నీ యమృతకీర్తి మేఘాలు
విశ్వప్రపంచాభ్ర వీథిదాక
ఫలియించినవి నీ యుపన్యాస బీజాలు
యనుజుని గుండె కమ్మని పొలాన

చిత్రగించినవి నీ శ్రీవాక్య మణిభూష
ణములు భారతము మస్తము ధరించి
సంతసించినది నీ సాహసోదగ్ర చే
తముఁగాంచి ఘనబంగళము పురంధ్రి

మ్రొక్కినది దిశాగోళమ్ము మురిసిపోయి
నరనరంబుల పౌరుషం బురలిపోవు
నీ తనూవిలాస మది మంటిని గలసెనె ?
వందనశతమ్ము గొమ్ము సుబాసుబాబు !

## ఎ ఱు క

తెలుఁగు వాఙ్మయజలధిలో జలకమాడి
వలపురతనాల పదముల తిలకమద్ది
జిలుగు మెఱుగుల మవ్వంపు చీరఁగట్టు
చేవఁగల బోటి నా కవితావధూటి.

ఈ కవికోకిలాలపన మీసుమనోజ్ఞ కళాపునీత క
న్యా కమనీయ నవ్యనటన ప్రవిభాసితమైన రేఖ ! వి
ద్యాకలనమ్ము లీ సరసులాత్మకు నిత్యము మోదమీయదే ?
కాక వసంతగాన కలకంఠి సుకంఠము కంటకంబెగా ?

కమ్మని తేట తెన్గునుడి కారపు సొంపురసార్ద్రి దివ్య భా
వమ్ము లిఖింపనేర్పు ప్రతిభాయుతుఁడైన కవీంద్రుఁ డొడ్డ గం
టమ్మున నుండుగాని కవనమ్ము రచింప నెఱుంగలేని, ద
ద్దమ్మ కలానికీ విషయమందునె ? తన్నుక చచ్చె నేనియున్.

నన్నువరించివచ్చె నొకనాఁటిద? యీ కవితాలలామ! పే
ర్గన్న కళావిభాసిని జరామరణంబును లేనివాణి! పో
మ్మన్నను పోని కన్యక నితాంత యశఃకలితాభిరామ సం
పన్న తెలుంగుశారద శుభంబిఁక జన్మము ధన్యమయ్యెడిన్.

# నిరాశ

ఈ కఠినప్రపంచమున నీ కలికాలయుగాన సత్కళా
శ్రీకి ఘటిల్లునే? ప్రశుభచిహ్నితగౌరవ సంపదాళి శ్రీ
లోకము చేతిలో నిలిచి లోకముఁ గుడ్చునె? గంజిబువ్వ పే
రాకటఁగొన్న సత్కవికి నన్నముఁ గుప్పెడు కల్గునే? తల్లీ!

జీవితమే యెడారియయి చిన్నము సౌఖ్యములేని నేను, నా
జీవితమెందుకో యనుచు చింతిలుచుందు క్షుధార్తమూర్తినై
నావినుగున్, కళాధనమునన్ గనిపెట్టు రసజ్ఞమూర్తి లే
డా వసుధాతలాన భరతాంబిక! నా బ్రతు కింతియేనటే?

నా కమనీయ కావ్యలలనా నవమోహినిగాన నిర్ఝరిన్
తేకువమీర మున్గిన దిదే మునిముచ్చుల జాతి స్వార్థపుం
జీకటికోణమందనుచు చిన్మయమూర్తులు దారి నిత్తురా!
ఆకలిదీర్తురా! కళలకాదరణంబిడి యుద్ధరింతురా!

ఎవడు సృష్టించినాడో ? యస్పృశ్యజాతి
కలదె ? వానికి శాంతిస్వర్గమున నేడు
నెందఱెందఱు చితికెక్కి యేడ్చినారో ?
ఇంక నెందఱు చితికెక్కి యేడ్తురో క్కా ?

అరుచియు రుచ్యమెగ్గని దివాంధపుజాతికి కన్నులున్న రా
తిరి కనిపించునా ? పగలు దీనులుఁ బేదలుఁ గానిపింతురా ?
చరఖమునీశ్వరుం బ్రబలశక్తుల చాటున డాగి డాగి ట
క్కరితనపున్ వినాదములు గారడిసేతలుగాక! చూడఁగన్.

పాపులపాలిట దిక్కై
యేపారిన యేసుక్రీస్తు హిందూక్షితికిన్
ప్రాపయి మ్రొక్కులుగొను మా
బాపూజీ వాక్కులింత ఫలియించునటే ?

కరుణకుఁ దావుఁగల్గు మొనగాండ్రు జనించిన ధర్మసీమలోఁ
గరుణ యొకింత సూపని యకల్మషులుండినవారిలోనఁ గొం
దరుఁ గరుణాస్వరూపులు, గుణాన్వితశీలురు వారిచేతకున్
హరిజనభావమే తొలగెనా ? నుడులెందుకు వేయిబల్కినన్.

కొడుకుల్ ఖద్దరుధారులై నిలిచి నీకున్నీ మహాఖ్యాతికిన్
గొడుగుల్ బట్టిరి, సర్వదేశములు నింగొండాడ, స్వాతంత్ర్య వీ
ర ఢమారావము మ్రోతమ్రోగినది నైరాశ్యాన జీవించు నీ
వెడమన్ జేసిన జాతివారి కిక లేదే? శాంతి సౌభాగ్యముల్.

ఎందుకు మానవాకృతిని సృష్టి యొనర్చెనో? చెప్పునా చిదా
నందుఁడు, చెప్పుచోఁ గలుగునా? మరి కూఁదలుఁ, గల్గుచో మహా
నందము నొందునా? కడుపునం జెలరేగు దవానలంబుకై
ముందర ప్రశ్నకై యెదురుబోధలు సేయునె? భారతాంబకా?

ఇది నా కాంగ్రెసు నాకు పూచిగలదిం దేలోప మున్నన్ బదా
బదలైపోయిన నేటి కాంగ్రెసు మహావర్గమ్ములన్ దిద్దగన్
గుదురన్నేర్తురె నా సహోదరులు నాకుంగల్గు ధీశక్తితోన్
బదివేయేండ్లు జపించినన్ గలుగునే? బాపూజి స్వప్నార్థముల్.

ఎపుడో బుద్ధుడు నేసుక్రీస్తు జనులం దింతింత ప్రేమంపు టా
లపనంబుల్ గఱపించినారలు సముల్లాసోజ్జ్వలాధీశులై
యిపుడీ యుండియు పండుతాత పలుకేమీ! తక్కువా కాదు నే
రుపులైనారె సమానతత్త్వమును ఘూర్తుల్ నాదుభ్రాతృబ్రువుల్

ఎవనికి వాడె బాహువుల నెత్తి సవాలునుఁ జేసికొంట నీ
యవమతి జాతిలక్షణమటన్న నొకప్పు డఖండ దివ్యభో
గ విభవ మందుకొన్న గుణగణ్యవు నీ కుదయించు నీతనూ
భవుల కిదేమిటమ్మ! తలవంపులు సేయు కుబుద్ధిమాత్రముల్.

ఈక్షణిక జీవితమ్మున కేల యింత
లేని గప్పాలు చిత్తప్రవృత్తి మార్పు
మరణమొందిన నిముసాన మంటిగలియు
నరుడు తనదింత తీసికొన్నదియు లేదు.

క్షమమున్ సాధనఁజేసి తెచ్చిన లసత్ స్వాతంత్ర్యదీక్షాశతాం
గమునెక్కెన్ సయిదోడు తానలతితానంబిచ్చునం చాసతోన్
సుమపుంగుత్తియ లారతిచ్చితిని కన్నుల్ వేయిగాఁజేసి పా
పము! తానెక్కిన స్యందనమ్మునికనాపై దోలుచున్నాడమా!

ఇదిగో! నా కవితాకళాసతిని మున్నీరాజు పోషించినా
డది స్వర్ణాక్షరమాలలై యెసఁగ తానాహా! కడున్ మందభా
గ్యదశన్ దేలెడువాఁడు నేఁడు గలదే? కాంతుల్ కళాలక్ష్మికిన్
కదుకన్ ముట్టని జాతులుం గలుగు నీ గమ్మత్తు లోకమ్మునన్.

నాకను రెప్ప విప్పిన క్షణమ్మున సుందర విగ్రహోత్కళా
శ్రీకి నివాసమౌ క్షితిని చీకునఁ జింత నిరంతరోగ్ర దుః
ఖాకృతిఁ దాల్చు పేదల ముఖా లగుపించునుగాని తల్లిరో!
ఈ కలవారలీ ప్రభువులీ సుఖభోగులఁ గానుపింతురా !

ఎన్ని దీపావళుల కాంతు లిగింపోయె
భయద కాల తస్కరుని నిశ్వాస కతన
నెన్ని దీపావళు లికను పృథివిలోన
వెలయనున్నవో? యేరికి తెలియఁగలదు.

ఇది సిఫారసులోకమ్ము ముదిమిబట్టి
మూలవడుటకు నింకెన్ని పుష్కరములు
జరుగవలయునో? కాలచక్ర రథగమన
బహుమహా వేగమను గృహాభ్యంతరమున.

చుట్టుముట్టడికి నా శుభసంస్థలోఁ జేరె
ప్రతికూల రాక్షసి పచ్చిబలము
పలుకుచున్నారు బొజ్జల పోషణార్థమ్ము
పదవి నాకాంక్షించి స్వార్థపరులు

ధ్వంసమ్ము గావించె పనికిమాలిన యుప
న్యాసాలు దేశభాగ్యాలనెల్ల
వెలిపొందె హాస్తినాపురి కోట బురుజుపై
గారాల ధర్మచక్రధ్వజమ్ము

అమృతసారంబుఁ గురియు నాయకుల మనము
క్షప్త సమరసభావంపు లేమికతన
పాడువడ్డది నా రత్నభావ గీతి
తోలకరించునె? నాపాట మొలకలెత్తి.

నా హృదయవార్ధి నుబుకుచున్నది కవోష్ణ
భావవీచికా సందోహ పరమదీప్తి
రాణజెందునో? తెలుఁగు పొలాన, లేక
కునికిపోవునో? పాలిపోయిన కులాన.

నీ పూరికొంపలోఁ గాపురం బొనరించె
గతిలేని లేమి వాల్గంటి తల్లి
నీ గర్భగోళాన నిండుకొన్నది సుంత
విద్దియు నెఱుగని ముద్దుగుమ్మ

నీ రక్తనాళాల బారుమన్నది భయా
నక రూపమున నహంకారశక్తి
నీ స్పృహాసౌధాన నటీలాస్య మొనరించి
చీకు సల్పెను చింకి చేటలమ్మ

రెండువందలేండ్లనుండి నీ నెత్తిపై
పడ్డ భరము నాప బలము లేక
బక్కచిక్కి చివికి బ్రతికిన దాన నీ
పండుకాపురంబు ప్రబలుటెపుడో ?

వ్యక్తిస్వార్థమ్ము వర్ణతత్వాలు నేటి
రాజకీయ శ్మశాన దురంతసీమ
వికృత రూపాన దయ్యాల విధము నర్త
నం బొనర్చుచు దూలుచున్నది మతంబ!

# సంక్రాంతి సందేశము

దినవెచ్చమునకు బత్తెము లేని, నిఱుపేద
దంతాల ముత్యాల కాంతులీన
తెలుఁగువీథుల శుభోజ్జ్వల శోభనపు పెంపు
నిండారు ముగ్గులు తాండవింప
బంగారు సృష్టించు వరిపొలాలకు, కృషీ
వలులు పొంగుచు నమస్సుల నొనర్ప
సన్నసన్నగను దిశాసంభృతంబైన
చిఱుగాడ్పు పిల్లల చుఱుకు హెచ్చ

నవయుగారంభ శుభమహోన్నత విభూతి
గంపకెత్తించి మకరసంక్రాంతిలక్ష్మి
పంచిపెట్టఁగ వచ్చె నీపాలి భాగ
మందుకొనవోయి నేడె? వీరాంధ్ర తనయ!

కడకంటం బ్రసరించి చూడుమదె లోకక్షేమముం గోరు న
బ్బడుగుం బేదల నీతిజీవనసుధాస్వాంతాలు, సంక్రాంతిలో
గుడిసెల్ గూడను నిబ్బరించినవి నిగ్గుల్ సిమ్మి యానంద మి
క్కుడ నృత్యంబొనరించి జాతికి నలంకారంబుగా వెల్గెడిన్.

ఈ సింగారము లీయొయారములు నా యీ స్నిగ్ధపుంభావ వి
న్యాసా లీ నునుదేరు ముగ్గులు, కళానందస్వరూపాంకమై
యీ సంక్రాంతికి వన్నెగూర్చినవి ఆయీ మేల్మివస్త్రాలతో
ఈ సంతోషముఁ బంచుకొమ్మిక గుణాబ్ధీ! ఆంధ్రవీరాగ్రణీ!

ఖరుచై పోయినగాని పందెములకున్ గాలింతదూరానఁ బె
ట్టరు మా వెల్మలు;కోడిపందెముల వాటా లేని యాంధ్రుండు నే
డరు దన్నంబని లేదు గ్రామముల నంతా క్షేమమేనా !సహో
దర! సంక్రాంతి శుభాలు మీకగుత నాంధ్రంబుబ్బిపొంగారగన్

ఆంధ్రశౌర్యజ్వాల లగుపింప పందెమున్
కొక్కొ-రో యనెను నీ కోడిపుంజు
నవనవోజ్జ్వల భావనలు రాష్ట్రదీక్ష రే
కెత్తించె నీ నల్వ దేండ్ల వ్రతము

తెలుగింట్ల మొగసాల నిలిచి మేల్కొలుపఁగా
శంఖమ్ము నూదె నీ జంగమయ్య
డూ డూ డు బసవన్న క్రీడ మోదింపించు
ఘల్లు ఘల్ మువల నీగంగిరెద్దు

తెలుఁగువీథుల నవకంపు వెలుఁగుఁజాడ
లెల్ల దిశలందుఁ బంచె నీ పల్లెసీమ
బూజువట్టిన సిద్ధాంతములకు బోశ
తమ్ముడా రమ్ము : ఆంధ్రగానమ్ము పాడు.

## పటేలు

ఏమిా! జాతికి మూలకంబమగు వాడే యేగెనా? భారత
క్షామాంగళ్యముఁ జక్క దిద్దిన ప్రశంసార్హుండు, సాబర్మతీ
స్వామింగొల్చిన దొడ్డవాఁడు ప్రశుధ స్వాంతుండు బృందావనీ
సీమం జేరెనె? వల్లభాయి యనుజల్ చింతాబ్ధి నల్లాడగన్.

"జవహరులాలు నెహ్రూ నడిసన్నయుదాత్త మహామనీషి! మా
నివిధుఁడు గాంధి వారసుఁడు నీవు గతించినవెంటనే పటే
లు! విడిచినాడు బాష్పములు రోజుచు దిక్కులకెత్తు నీ యశ
శ్ఛవులకుఁ బాఅజల్లిన విశాల వినిర్మల కీర్తికి న్నతుల్.

భరతసవిత్రి నిబ్బరపు గుండియలోన
ప్రళయకాలాగ్ని కీలలు దహింప
సిసలైన జాతి కాంగ్రెసు నాయకేంద్రుల
మెత్తని చిత్తాలు చిత్తవోవ

లలిత శోభాకళా లావణ్య రుచిఁ జాటు
సిరిమించు బాపుటా చిన్నవోవ
మొనమొన్న నే దేశమున దాపురించిన
శాంతి దేవత మేను జలదరింప

భరత ధాత్రి తండ్రివై రాటు తేలిన
వల్లభాయి మమ్ము బాసినావు
కొంప చక్కదిద్దు కొడుకులఁ గన్నట్టి
హిందుమాతృక దురదృష్టరేఖ.

# స్వేచ్ఛాకాంక్ష

తొలగిపోయినది యాంగళ భూపు నర్థించు
దిక్కుమాలిన బీద బిక్కుతనము
చెరగిపోయినది దుర్భర దాస్య నిబిడాంధ
కార రేఖా చమత్కారముద్ర
వెలిసిపోయినది దిక్కులఁ జలాయించిన
పగవాని బావుటా పచ్చదనము
ఇంకిపోయినది రాట్కైంకర్యపు స్మైన
పరవళ్ళఁ ద్రొక్కిన పందతనము

తరలిపోయె తెల్లదొరగారి చెప్పులు
మోసి బ్రతికినట్టి మోటు బ్రతుకు
విజయకాహళాలు వెలిగించుకొన్నాను
పూర్ణరాజ్యమంచుఁ బొంగినాను.

అనుకొన్నాను సమగ్రపుం భరతరాజ్యంబందు నా నామమున్
గణియింపంబడునంచు నాయెద స్పృహాకాశా మహామండలం
బున నా బంగరుటూహలన్నియయయో! పోల్పారకంబోయెనీ
దినమున్ దిగ్గయ భావగీతికల కేదీ! పాడఁ దావింతకున్.

పున్నెము మూటఁగట్టుకొని పున్నమ వెన్నెల కీర్తిఁ దోగు సం
పన్నకుటుంబినీ భరతభామిని! నీకు నమస్కరింతు నీ
పిన్నలు పాపలున్ నిలుచు విశ్వమహాసమతా స్వతంత్రతన్
భిన్నత లేని రాజ్యమున బేరజులుండు టదేమికర్మమో?

జర్జరించినది ఘూర్జరసెట్టి మరణాన
విశ్వంభరాదేవి విమలతనువు
చితికిపోయినది భారత పుణ్యగేహాని
కుదురైన పిడికెడు గుండెకాయ
వణకిపోయినది ప్రవర్ధమానంబైన
జాతీయ కాంగ్రెసు సంస్థలక్ష్మి
మునిగిపోయినది దుమ్ముకుమారపున్ వార్ధి
యనుఁగు సోదరుల దోహదపుమాట.

పసువుమాలె మాడు పండు సంసారంబు
కిసిసి దెబ్బలాడుకొనుట కతన
పసువుకొఱకు మేము బ్రతుక లేమది గాని
పదవికొఱకు మేము బ్రతుకగలము.

ప్రళయ పురుషుండు విలయ నర్తనముఁ జేసి
సర్వ భూప్రపంచమును నాశనమొనర్ప
కటికి చీఁకటి తెరల రంగస్థలానఁ
బొడలినాడు క్షమాపుత్రుఁ డుదయమగునె?

ప్రత్యక్షమైనది ప్రళయాగ్ని భల్లమ్ము
కముల జాండమ్ము నిప్పుకల మునుంగ
దీర్ణమైనది హిందు దేశమ్ము గర్భమ్ము
తురక తమ్ముల కత్తి చరితలోన
శిథిలమైనది సర్వ పృథివి దేవత మెచ్చు
శాంతి సమాధాన సదనభూమి
మందమైనది సుధామయ కళాశోభిత
సత్కవీంద్రుని చాకచక్య రచన

అమృత మయమైన రామరాజ్య స్వరాజ్య
భవన భాగంబు లభియింప వలనుపడదు
బక్క కోమటి ఖదరు షట్పదనినాద
గీతికల మ్రోతలింత తగ్గినవి నిజము.

## హెచ్చరిక

చల్లారెనే? బౌద్ధ సన్న్యాసి కట్టిన
యనుకంపమగు మేటి యజ్ఞవాటి
అణగారెనే? నరేంద్రుని వీర హైందవ
జాతీయగీతా ప్రచారరవము
ఆగిపోయెనె? బయిరాగి కోమటి తాత
రాటాల తుమ్మెద పాటలవము
నశియించెనే? భువనంపు మ్రొక్కులఁగొన్న
రమణ మహర్షి వజ్రాలతపసు

పూచిపండిన సత్కీర్తి నోచుకొంచు
ఘనతకెక్కిన బిడ్డలఁ గన్నతల్లి
నీ భరతమాత దేశాల నించవోయి
ప్రథిత గౌరవశ్రీల నో భారతీయ.

త్యాగానం దెలవాఱఁ దల్లడిల బ్రహ్మాండంపు పోరాటమున్
సాగింపం దొరకొన్న బాపుజి యహింసాసూత్రమార్గాన, దీ
క్షా గాథల్ పఠియించి కాంగిరెసు లక్ష్యంబున్ సమర్థించు నీ
కే గోచీచ్యుతమైన దేశమున కేదీ ! సిద్ధి దీక్షారతా !

సాగుచున్నది వర్ణసంఘాల భేద పై
శాచికీ దీర్ఘ నిశ్వాసబలము
నిక్కుచున్నది నీతినియమమ్ము విడనాడి
పక్షపాతంపు గప్పాలమారి
ఆడుచున్నది రహాస్యము గిహాస్యము వీడి
నడివీథి లంచాలనంగనాచి
త్రాగుచున్నది దరిద్రజనాళి రుధిరమ్ము
పేరైన నల్లబజారు జలగ

శ్రమలవడ్డ జాతిసాయంబుఁ గాంక్షింప
సానుభూతి నిడని జాతిసమితి
ఖదరుమాని దొడ్డ కట్టడి కెదురయ్యె
పరువు నిలుపుకొనుము భారతీయ !

ఒకవంకన్ వికటాట్టహాసమున నత్యుగ్రంపురోషాన గా
టకపుం దయ్యము వాడిదంష్ట్రికలు బిడ్డా! దేశముం జీల్చ జా
చుకొనన్ విందులు చెట్లు పబ్బములు పస్తుల్ పడ్డ దేశానకున్
సుకముల్ గూర్చునె? యొక్క ప్రాణికయినన్ బోనంబు లేకున్న చో

నన్ను నేలి నాకు నన్నంబు నిడనట్టి
స్వంత ప్రభుతకంటె జాతిదొరల
ప్రభుత మేలటంచు వాపోవు తమ్ముల
ప్రశ్నమునకు నీ జవాబదేమి ?

గణియింపందగు వీరభారత మహాఖ్యాతిన్ పుటల్ ద్రిప్పి, సా
ధనసేయందగు దివ్యభారత పురాధర్మంబు స్థాపింప, బో
ధన సేయందగు శాంత్యహింసల యథార్థత్వంబు రూపించి, పా
లనసేయందగు నీతిమార్గమున వీరా! నవ్యహిందూసుతా !

పుణ్యదేశపుటింటి మొగసాల నాడిన
యినుపగజ్జెల తల్లి కునుకుదాక
కులగోత్ర బంధనమ్ముల బంధితంబైన
శీర్ణభావములు నశించుదాక

ప్రతి పేదవాని సాంత్వనపు గుండియలోన
వెలుఁగు వెన్నెలతెన్ను కలుగుదాక
భువనమ్ము లగ్గింప మోజైన సమతయే
యెల్లరి హృదయాల నేలుదాక

చెలఁగి రేగి యిలు విజృంభించి, స్థంభించి
నిలిచిపోయినట్టు నీతికన్య
మరల భారతమున కెరలి మసలుదాక
మగతనమ్ము వీడతగదు తండ్రి !

V.R. NARLA MEMORIAL LIBRARY
V.R NARLA
D. P. R. I.
Acc. No. 10409

# రాష్ట్ర విజయ దుందుభి

ఆరలేదింక భాషారాష్ట్రవిభజన
వ్యత్యాసభావ దావానలమ్ము
కలియలేదింక ముక్కలు చెక్కలై పోర్గు
నిలయానబడియున్న తెలుగునేల

తెమలలేదింక గౌతమిపూతవాహినీ
లాస్యాన నణగారు సస్యలక్ష్మి
పూయలేదింక శ్రీ పొట్టిరాముని దివ్య
దాశయసిద్ధి దీక్షాసుమాలు

అలముకొనగలేదు తెలుగన్న గుండెలో
భ్రాతృభావరసవిభాసభూతి
ధర్మచక్రమెత్తి దయసేయరావమ్మ
దివ్యకల్పవల్లి తెలుగుతల్లి.

ఎపుడో నీకొమరుల్ కుమార్తెలుకడున్ హెచ్చైనత్యాగాలు సల్పి; పురాధర్మము నిల్వబెట్టి యశముం బెంపెక్కినారన్న దొడ్డ పదం బీనిముసంబుదాక నమరున్ డంబంబు కాదిద్ది, నీ కృపకున్ పాత్రులబెంచుమీ వసుధ తల్లీ! ఆంధ్రరాజ్యేందిరా!

తను రక్తంబును ధారవోసిరి యనంత త్యాగదీక్షా మహత్తును సాధింపఁ గుమారకుల్ తెలియలేవో తొంటిబంగారపున్ మని కీవెంతటి పుణ్యరాలవుగదమ్మా! నేఁటి స్వేచ్ఛాదినమ్మున సుస్నిగ్ధసువర్ణపూజల శుభమ్ముల్ పొందు మాంధ్రావనీ

నాజూకునడకలో మోజు చూపుటచేత
తేలిపోయినది నా తెనుగుబాణి
పరవాని బాసలో నెఱుఁగ నేర్పుటచేత
అణగిపోయినది నా తెనుగువాణి
శుద్ధమూర్ఖుని చెప్పుజోడు మోయుటచేత
దసిలిపోయినది నా ధైర్యలక్ష్మి
మూడువందల కులమ్ముల కుమ్ములాటలో
వాసిమాసినది నా వంశదీప్తి

నలువదేండ్లలోన సలిపిన తపసులో
నింత యైన నాకు వంతు గలదు
నన్నుఁ జూచుకొన్న నా కోఱమీసమ్ము
దిద్దుకొందు నేను తెలుగుతల్లి.

పూజాభాజనమైన నీ విభవవిస్ఫూర్జద్యశస్స్ఫీతికిన్
జేజే లిచ్చిరి, దిగ్దిగంతజనముల్ నీమాట పండయ్యె రా
రాజుల్ నీ కొమరుల్ సుఖంపుమరు గా రత్నాలవల్లీ! యిఁకన్
బాజాఁ గొట్టెద వీరకావ్య రచనా వైశద్యముం జూపెదన్.

సవరింతు వెఱ్ఱివేషముల వేసెడు నన్ను
తెనుగుబాబుల భావదీపకళిక
వివరింతు విశ్వమ్ము ప్రీతిమై కొండాడ
నా జాతికథల విజ్ఞానపటిమ
పచరింతు నిజువేదభావాన నింకని
దుఃఖంపు వేడి నెత్తురుకణాలు
నిరసింతు నభివృద్ధికరనిరోధకములౌ
గిఱురింపు పెను ప్రణాళికల వితతి

కులము కలిమిఁగాంచి పలుకరించని యెట్టి
పెద్దనైన లెక్కపెట్ట నింక
నన్ను నీవు మఱువకున్నచో బ్రతుకులో
దివ్యకల్పవల్లి తెలుగుతల్లి.

మొలిపించుమమ్మ పుత్త్రుల గుండియలలోన
సమరస భావ బీజాల వితతి
నిండించుమమ్మ పండిన మేలికీర్తి
దశదిశాగోళ వృత్తాలలోన
ధరియించుమమ్మ రత్నఘటిత గౌరవ
శ్రీ కిరీటమ్ము నీ శిరమునందు
మఱువబోకమ్మ సంపదకు దూరంబైన
కడగొట్టువాని నీ కన్నవాని

దివిజపంక్తి మెచ్చ తెలుగు తేజముఁ జాటి
యఖిల భువన పూజలందుమమ్మ
సకలగుణకదంబ సాటియెవ్వరు నీకు
దివ్య కల్పవల్లి తెలుగుతల్లి,

## శ్రద్ధాంజలి

తొలి విన్నాము శిబిక్ష్మాధిపుడు సంతోషమ్ముతో మేని కం
డలు ఖండించి ప్రసాదమై పులుఁగు కుల్లాసంబు గల్పించు వా
క్కులు; నీవో తెలుగుంధరిత్రికయి ఫక్త్రన్ కాయమర్పించి త
మ్ములకీర్తిన్ జగతిన్ రచించితివి బాబూ! పొట్టిశ్రీరాములూ!

బత్తిరహింప గాంధిముని భానుని జాడలనేగునట్టి నీ
సత్త్వ నెఱుంగు నాంధ్రి; గుణసాగర! నేర్పుము ప్రేమతత్త్వ సం
పత్తి! యమాయకుండవయి పాపవిధాన నలంగినట్టి నీ
కిత్తు తెలుంగుతండ్రి! శుభ మింపుదలిర్ప నమస్సుమాంజలుల్

కనిపించుచున్నది తెనుఁగన్నగుండెలో
దయలేని పక్షపాతంపు బుద్ధి
వినిపించుచున్నది భృతిలేని, నిఱుపేద
డొక్కమాడిన యట్టి బక్కపాట

చరియించు చున్నది సమద దర్పముఁ జూపి
        నడివీథిలాచాల నంగనాచి
నర్తించు చున్నది కర్తవ్య మెఱుగక
        జాతిభేదాలమ్మ జాతరమ్మ

ఎన్నినాళ్ళ నింక నేగి సాఁగునో కదా
బలము కలుగువాని కలుష రథము
భువనహితముఁ గోరు పొట్టి శ్రీరాములూ!
సురల భూమినుండి చూడఁగలవు

## అంబేద్కరు

ద్వైతా ద్వైతమతాలఖండమున నిద్రంబోని యస్పృశ్యతా
భూత వ్యాఘ్రిమహోగ్రదంష్ట్రల బలంబున్ బుగ్గిగావింపఁగా
జాతి శ్రేయముకై కులస్థుల మనస్తత్వంబు మార్పింపఁగా
నే తీరుం గడగండ్లకోర్చితివొ? తండ్రీ! డాక్టరంబేద్కరూ !

అలిగినావు త్వదీయకులవాంఛ ఫలియింప
పండు తాతయగుండె బెండువోవ
చదివినావు సమగ్ర శాస్త్రాలు సీమలో
నాంగ్ల భూమీపతు లౌడుగఁబడ
చర్చించినావు దేశస్థిత సౌభాగ్య
మాశించి బహువిషయమ్ము లెన్నొ
ఉస్సురన్నావు తమస్సులో మ్రగ్గుచు
బ్రతుకు పంచముల శుభమ్ముఁగోరి

కుటిల కులపిశాచి పటుదర్పము నణంచ
కట్టినావు వీరకంకణమ్ము
మనువువై యశాన మనినావు, మంత్రివై
యుండియాజగమ్ము నేలినావు.

వసతుల్ లేని కొలంబియానగరి విశ్వజ్ఞాన విద్యాలయా
న; సమత్వంబునుఁ జూపలేనిదొరలన్ కంగారుఁ గావించి పెన్
వసతిన్ బొందిన నీ యఖండమగు ప్రజ్ఞాపాటవశ్రీసమం
జస సంభారవిదగ్ధ భావనము పూజార్హమ్ము మేధానిధీ!

ప్రాణము త్రాణమున్ బలము రాణ సెలంగి వెలింగి నేఁడు ని
ద్రాణముగా నశించిన యధఃపతనంపు కులస్థులన్; దయా
శ్రీనిధి! యుద్ధరింప దయసేసిన నాల్గవ వేల్పవయ్య నీ
జ్ఞానపు చూపులో మనువుశాస్త్రము లేమగు చర్చసల్పగన్.

నీ వేలగ్నమునందుఁ బుట్టితివొ కానీ! నీదు విస్ఫార వి
ద్యావైశద్యము లేరికిం గలుగునన్నా! పేదవంశమ్ములో
నావిర్భావము నొందుటన్ కులపు దయ్యాలున్న దేశాన నీ
కే విశ్రాంతి హుళక్కియైననిఁక మా కేదీ సువిశ్రాంతియున్.

కోమటి యెత్తుతో దొరలకొల్వున వాదము సల్పి భారతే
క్షేమముఁ గోరుకొన్న మునిసిద్ధుని గాంధినెదిర్చి పంచమ
క్షేమముకై శ్రమించిన విశిష్టగుణాలయ! నీకతాన మా
కీ మెయి సౌఖ్యమబ్బెను మరేరికిఁగావలె మా విశేషముల్.

భగవంతుం డనువాసికే సమసిపోవన్ జాలి, యీలాటి దు
ర్భరదారిద్ర్యములో మునుంగు కులమున్ రక్షింపఁగా మానవుం
డగునే? యిట్టివి నీయెడం గలిగెనయ్యా! చూతువా! యిండియా
జగమందుం గల పంచమీయులను బాష్పస్విన్న దుఃఖాస్యులన్

కరుణామూర్తి బరోడరాజు నిను, నీ జ్ఞానమ్మునుం గాంచి య
బ్బురముం బొంది విశేషవిద్యకయి బాబూ! నిన్ను పంపన్ మహా
త్తర విజ్ఞానముగల్గు శాస్త్రముల సంద్రానన్ జలంబాడి బా
ధురతన్ హూణులమేలి వాక్యములదొంతుల్గాంచెఁ; స్తుత్యంబగున్.

ఆంధ్రప్రక్రియలో నటింపక, దయావ్యాసంగముం జిక్క మా
గాంధీ దేశమునందు నిమ్నజులకున్ గంజైన లేకున్నచో
హిందూసంఘము వీడుటే సొబగు వేయేలా? యెవండిచ్చునా
నందం బింత తెగించువాని కిఁకనన్నా! తెడ్డు సామ్యంబగున్.

పారసీయుల ముసాఫరు సత్రశాలలో
　　　నిదురింప జేనెడు నేల లేక
ధనవంతు లమెరికా కనకఖండములోన
　　　వసతిగృహంబులో బసయు లేక
ప్రభువు బుణార్థమై పనిచేయఁ గాంక్షింప
　　　సివిలుసర్వీసులో సీటు లేక
భయదకుల వ్యాఘ్రి స్వైరవిహార దు
　　　ర్గ్రథులలోఁ గాలుఁబెట్ట లేక

ఎవడు చదువలేని పృథులవిద్య గడించి
యభినవ మనువంచు నఖిలజగతిఁ
బేరుఁగాంచి నవ్య భారతరాజ్యాంగ
శాసనాల సృష్టి సల్పినావు.

V.R. NARLA MEMORIAL LIBRARY
V.R NARLA
D. P. R. I.
Acc. No.

88

BCi

BC

AOUA105B141



చిరునామా :

డాక్టరు యస్. టి. జ్ఞానానందకవి

ప్రధానాంధ్రాధ్యాపకులు

మెక్లారిన్ హైస్కూలు

కాకినాడ

## మనసు ఫౌండేషన్ పుస్తకాల పరిశీలనాపట్టిక

| | |
|---|---|
| పుస్తకం సంఖ్య | AOUA105B141 |
| పుస్తకం పేరు | పాంచజన్యము |
| తారీఖు | 31 December 2025 |
| ముందు అట్ట | yes |
| వెనుక అట్ట | yes |
| మొత్తం పేజీలు | 83 |
| పెద్ద సైజు పేజీలు | C1 88 BC1 |
| ఖాళీ పేజీలు | No |
| లేని పేజీలు | |
| తయారు చేసినది | భార్గవి |
| పేజీలు విడదీసినది | [illegible] |
| స్కాన్ చేసినది | Teja |
| పరీక్ష చేసినది | anusha |
| పేజీలు సరిచూసినది | |
| బైండింగు చేసినది | |
| ప్యాకింగు చేసినది | |
| పరిస్థితి | GOOD |